సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
బుధవారం, 16.09.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 316
పేజీలు: 08 వెల: రూ. 5

## నెట్-జీరో నగరంగా
# ఫ్యూచర్ సిటీ
### ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్‌కు సీఎం రేవంత్ వినతి

02

- 30వేల ఎకరాల్లో అభివృద్ధికి ప్లాన్.. మూసీ పునరుజ్జీవంలో సహకరించండి
- తాజ్ ఫలక్ నుమా ప్యాలేస్ లో భేటీ
- ఆగాఖాన్ ఫౌండేషన్ సహకారంతో వారసత్వ భవనాల పునరుద్ధరణ
- తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కు హాజరుకావాలని ఆహ్వానం



## తెలుగు రాష్ట్రాలకు
# కేంద్రం కానుక
### అదనంగా 5 లక్షల ఇళ్లు మంజూరు

- ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షల ఇళ్ల కేటాయింపు, తెలంగాణకు 2 లక్షలు
- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హులకు ఇళ్ల నిర్మాణానికి అవకాశం
- త్వరలో జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంపిక




**ముద్ర ఢిల్లీ :** తెలుగు రాష్ట్రాల్లో సొంతింటి కోసం ఎదురు చూస్తున్న పేదలకు కేంద్రం భారీ శుభవార్త చెప్పింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు కలిపి 5 లక్షల ఇళ్లను కేటాయించినట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో ఏపీకి 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మిగతా 02లో

## రూ.2వేల వరకు యూపీఐ
# చెల్లింపులు ఉచితం

- వినియోగదారులకు ఊరట
- 2 వేల లావాదేవీలకు నోఛార్జీ
- రూపే డెబిట్ కార్డు చెల్లింపులకూ ఇదే నిబంధన
- కేంద్రం అధికారిక స్పష్టత

02




## పదవుల
# పండుగ

- 50 కార్పొరేషన్లకు కొత్త బాస్‌లు
- కులగణనతో మారనున్న లెక్కలు
- సామాజిక న్యాయానికి పెద్దపీట
- పార్టీ కోసం పనిచేసిన వారికే..
- పాతవారికి రెన్యువల్
- ఆశావహుల్లో పెరిగిన ఉత్కంఠ
- కులగణనే కీలక ప్రాతిపదిక

### ఈ నెలాఖరులోగా పదవుల భర్తీ

## నామినేటెడ్ పదవుల భర్తీకి కాంగ్రెస్ కసరత్తు



**ముద్ర, డెస్క్:** తెలంగాణలో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీకి కాంగ్రెస్ పార్టీ వేగం పెంచింది. సెప్టెంబర్ నెలాఖరులోగా సుమారు 50 కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లను నియమించాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆశావహుల పేర్లతో జాబితాను సిద్ధం చేస్తున్న పార్టీ.. దానిని సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ పరిశీలనకు పంపనున్నట్లు సమాచారం. వారి ఆమోదం అనంతరం నామినేటెడ్ పదవులపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

**పార్టీ కోసం పనిచేసిన వారికే ప్రాధాన్యం**

2024 జూలైలో రెండేళ్ల కాలానికి నియమితులైన పలువురు నామినేటెడ్ పదవుల కాలపరిమితి ఈ ఏడాది జూలైతో ముగిసింది. కొందరికి ఇప్పటికే మరోసారి అవకాశం కల్పించినప్పటికీ, మరికొన్ని పదవులు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొత్త నియామకాలపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి సారించింది. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనకుండా, పదవులు పొందిన తర్వాత ప్రజలకు దూరంగా ఉన్న నేతలకు మరోసారి అవకాశం ఇవ్వకూడదన్న అభిప్రాయం పార్టీ అంతర్గత సమీక్షలో వ్యక్తమైనట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేసిన నేతలకు గుర్తింపు ఇవ్వాలన్నదే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. అయితే ఇప్పటికే పదవులు అనుభవించిన కొందరు నేతలు మరోసారి అవకాశం కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల ద్వారా అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది.

**కులగణనతో మారనున్న సమీకరణాలు**

ఈసారి నామినేటెడ్ పదవుల భర్తీలో కులగణన కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. సామాజిక న్యాయానికి ప్రాధాన్యమిస్తూ మిగతా 02లో

## నవంబర్ 19 నుంచి
# రూ. లక్ష సాయం
### యువతకు గుడ్ న్యూస్



- రాజీవ్ యువ వికాసంపై కీలక అప్‌డేట్
- స్వయం ఉపాధికి ఆర్థిక చేయూత
- అర్హులకు రూ. లక్ష వరకు సాయం

02



## న్యాయ వ్యవస్థపై విమర్శలు
# తప్పు కాదు
### తీర్పు ఇవ్వడమే పారదర్శకత అనిపించుకోదు

03

- జవాబుదారీతనం, సంస్కరణలు కొనసాగాలి
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు

న్యాయస్థానాలు రాజ్యాంగానికి కాపలాదారులు కావచ్చు.. కానీ అవి విమర్శలకు, పరిశీలనకు అతీతమైనవేమీ కావు! వ్యవస్థ పనితీరుపై వచ్చే ఆధారసహిత, నిర్మాణాత్మక విమర్శలే ప్రజాస్వామ్యాన్ని బ్రతికించే ఊపిరి అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థ వద్ద సైన్యం లేదా ఆర్థిక అధికారాలు ఉండవని, ప్రజా విశ్వాసమే దానికి అసలైన బలమని పేర్కొన్న ఆయన తీర్పుల వెనుక ఉన్న స్పష్టమైన కారణాలను వెల్లడించినప్పుడే నిజమైన పారదర్శకత సాధ్యమవుతుందని తేల్చిచెప్పారు. సంస్కరణలు లేని వ్యవస్థ నిశ్చలంగా మారిపోతుందని హెచ్చరిస్తూ, న్యాయవ్యవస్థలో జవాబుదారీతనం, పారదర్శకత నిరంతరం కొనసాగాలని పిలుపునిచ్చారు. -ముద్ర డెస్క్




## నా పీఆర్‌ఓ, పీఏపై
# దాడి
### 15 మంది గూండాలతో పని
### పోలీస్ స్టేషన్ లో దాడి చేసిందెవరు?



- పోలీసులు ఏం చేస్తున్నారు
- దాడి ఘటనపై ఎఫ్ ఐఆర్ నమోదు చేయకపోవడం దారుణం
- ఈ అంశంపై కోర్టులను ఆశ్రయిస్తాం
- వెయ్యి రోజుల పాలనా వైఫల్యాలపై ప్రశ్నిస్తూనే ఉంటాం
- న్యూఢిల్లీలో జాతీయ మీడియాతో బీఆర్‌ఎస్ నేత కేటీఆర్

02

# బ్రిటన్ ముక్కలు
### రవి అస్తమించని సామ్రాజ్యానికి దారుణ దశ
### బ్రిటన్ భవిష్యత్తుపై కొత్త చర్చ

- స్కాట్లాండ్, ఉత్తర ఐర్లాండ్‌లో స్వాతంత్ర్య కాంక్ష
- ఇప్పుడు కేవలం ఇంగ్లాండ్‌కే పరిమితమా?
- ఐర్లాండ్ లో ట్రంప్ పర్యటనతో వేరుబాట ఖాయం..
- ఇంగ్లాండ్‌తో స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ బంధంపై ఉత్కంఠ



**ముద్ర డెస్క్:** ఒకప్పుడు ప్రపంచాన్ని శాసించిన బ్రిటన్.. ఇప్పుడు తన అస్తిత్వాన్నే కాపాడుకోవాల్సిన పరిస్థితి ఎదుర్కొంటోందా? ఇంగ్లాండ్, స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ కలిసి ప్రస్తుతం యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)గా ఉన్నాయి. అయితే ఈ యూనియన్ భవిష్యత్తుపై కొంతకాలంగా చర్చ జరుగుతోంది. 16వ శతాబ్దంలో వేల్స్ ఇంగ్లాండ్‌తో విలీనం కాగా.. 1707లో ఇంగ్లాండ్, స్కాట్లాండ్ కలసి గ్రేట్ బ్రిటన్‌గా ఏర్పడ్డాయి. 1801లో ఐర్లాండ్ కూడా యూనియన్‌లో చేరింది. అయితే 1922లో ఐర్లాండ్‌లోని మెజారిటీ ప్రాంతం మిగతా 02లో

# అల్లు మామపై కేసు
### భూవివాదంలో కేసు నమోదు



- చంద్రశేఖర్ రెడ్డికి షాక్
- గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు
- సీసీటీవీ ఆధారాలు సమర్పణ
- అనుచరులపైనా చర్యలకు డిమాండ్

02

# సీఎంతో విభేదాల్లేవు
### కానీ కొండాను తొలగించడం బాధించింది

- కేబినెట్ విస్తరణపై మహేష్ గౌడ్ కీలక వ్యాఖ్యలు
- వచ్చే ఎన్నికల్లో 14-15 ఎంపీ సీట్లు లక్ష్యం
- రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

03



## మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని
# హఠాన్మరణం
### గుండెపోటుతో ఆళ్ల నాని మృతి

- 1969లో ఏలూరులో జన్మించిన ఆళ్ల నాని
- గత ఏడాది వైసీపీని వీడి టీడీపీలో చేరిన నాని



02

### ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 16.09.2026
www.mudranews.in | @mudranews



## ముఖాన్ని పదేపదే చేతులతో తాకద్దు



కళ్లు, ముక్కు, నోటిని చేతులతో తరచూ తాకడం వల్ల క్రిములు శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది. కాబట్టి ఈ అలవాటును తగ్గించుకోవాలి.

### మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని

# హఠాన్మరణం

**ముద్ర, అమరావతి:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఏపీ మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. విశాఖలోని తన నివాసంలో ఆయన



కు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణాలు విడిచారు. ఆయన ఆకస్మిక మృతి వార్త ఏలూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ వర్గాలను, పార్టీ శ్రేణులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆళ్ల నాని వయసు 56 సంవత్సరాలు. 1969లో ఏలూరులోని శనివారపుపేటలో జన్మించారు. ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీలో ఇంటర్, ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో బీకాం చేశారు.
కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన ఆళ్ల నాని, 2004లో తొలిసారిగా ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 2009లో కూడా కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2013లో కాంగ్రెస్ కు గుడ్ బై చెప్పి వైసీపీలో చేరారు. 2017లో వైసీపీ తరపున ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2019లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం డిప్యూటీ సీఎంగా.. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలను నిర్వహించారు. గత ఎన్నికల తర్వాత వైసీపీని వీడిన ఆయన 2025, ఏప్రిల్‌లో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆళ్ల నాని మృతి పట్ల ఏపీకి చెందిన రాజకీయ నేతలు సంతాపం ప్రకటిస్తున్నారు. ఏలూరులో ఆయన భౌతికకాయాన్ని దర్శించుకునేందుకు అనుచరులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.



**ముద్ర, హైదరాబాద్:**
హైదరాబాద్‌లోని తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్

## నెట్-జీరో నగరంగా

# ఫ్యూచర్ సిటీ

లో ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్–Vతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ వారసత్వ సంపద పరిరక్షణ, మూసీ నది పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ వంటి పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సిఎం సలహాదారు రామకృష్ణారావు, ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.
అగా ఖాన్ ఫౌండేషన్‌పై తమకు అత్యంత గౌరవం ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. తెలంగాణ వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో అగా ఖాన్ ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఫౌండేషన్ సహకారంతో ఇటీవలే శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించుకున్నామని, కుతుబ్ షాహీ టూంబ్స్‌ను కూడా అగా ఖాన్ ఫౌండేషన్ పునరుద్ధరించిందని పేర్కొన్నారు.
మూసీ నది పునరుజ్జీవం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని సీఎం తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలోని సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో అగా ఖాన్ ఫౌండేషన్ సహకారం కోరుతున్నట్లు తెలిపారు. ఉస్మానియా ఆసుపత్రి కోసం గోషామహల్‌లో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని వారసత్వ సంపదగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. మూసీ నదిని నైట్ ఎకానమీకి అనుగుణంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు.
అలాగే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు తప్పక హాజరు కావాలని ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్–Vను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఈ సమ్మిట్‌కు 100కు పైగా దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం చెప్పారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని, దీనిని నెట్–జీరో సిటీగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. ఎయిర్‌పోర్టుకు కేవలం 20 నిమిషాల దూరంలో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని తెలిపారు. ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను సింగపూర్‌కు చెందిన సంస్థ రూపొందిస్తోందని రేవంత్ రెడ్డి చెప్పారు. ఇందులో 15 వేల ఎకరాల్లో గ్రీన్ జోన్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అమెజాన్ వంటి ప్రముఖ సంస్థలు ఇప్పటికే ఫ్యూచర్ సిటీలో తమ కార్యకలాపాలను ప్రారంభించాయన్నారు.

# నా పీఆర్ఓ, పీఏపై దాడి

**ముద్ర, హైదరాబాద్ :**
హైదరాబాద్ లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తన పీఆర్ఓ మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిపై దాడి చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారుల సమక్షంలోనే ముసుగులు ధరించిన 15 మంది గుండాలు లోపలికి చొరబడి పక్కా ప్రణాళికతో ఈ దాడికి పాల్పడ్డారని.. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యానికి ఇది నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి, హోం మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని, అణచివేతకు తలొగ్గని ప్రతీ పౌరుడికీ భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.
అసెంబ్లీ గేటు ఘటనకు సంబంధించి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఉన్నప్పటికీ, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే విచారణ పేరుతో ఉదయాన్నే స్టేషన్‌కు పిలిపించి చీకటి పడే వరకు కాలయాపన చేసి ఈ కుట్రకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ గుండాలు ఈ దాడికి పాల్పడ్డారా? లేక పోలీసులే మఫ్టీలో ముసుగులు వేసుకుని వచ్చారా? అనే దానిపై నిజాలు బయటకు రావాలంటే తక్షణమే సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ ఫుటేజీని వెంటనే భద్రపరచాలని, గాయపడిన తన సిబ్బందికి రక్షణ కల్పించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలను నిరసిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని 'ఎక్స్' వేదికగా ట్యాగ్ చేస్తూ 'వెల్‌డన్ కాంగ్రెస్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.



# తెలుగు రాష్ట్రాలకు కేంద్రం కానుక

(మొదటి పేజీ తరువాయి)
చేసిన కేటాయింపులతో పోలిస్తే ఈసారి 2 తెలుగు రాష్ట్రాలకూ అదనంగా ఇళ్లు మంజూరయ్యాయని చెప్పారు.
దేశవ్యాప్తంగా పేదల కోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 2 కోట్ల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. అందులో 5 లక్షల ఇళ్లను తెలుగు రాష్ట్రాలకు కేటాయించినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో తెలుగు రాష్ట్రాలకు ఈ స్థాయిలో ఇళ్ల కేటాయింపు జరగడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. 2024లో కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన కేటాయింపులతో పోలిస్తే ఏపీకి అదనంగా 2.25 లక్షలు.. తెలంగాణకు మరో 1.25 లక్షల ఇళ్లు మంజూరైనట్లు వివరించారు. ఇళ్ల కేటాయింపుపై కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం పలుమార్లు కోరిందని.. ఆ రాష్ట్రం అడిగిన దానికంటే ఎక్కువగానే ఇళ్లు మంజూరు చేసినట్లు కేంద్రమంత్రి చెప్పారు.
2019–2024 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 1.78 లక్షల ఇళ్లు కేటాయించగా.. వాటిలో సుమారు 42 వేల ఇళ్ల నిర్మాణం మాత్రమే పూర్తి అయిందని కేంద్రమంత్రి పెమ్మసాని పేర్కొన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణం వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉందని తెలిపారు. ఇప్పుడు కొత్తగా మంజూరైన ఇళ్లతో పాటు గతంలో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాన్ని కూడా వేగంగా పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. వచ్చే 2, 3 సంవత్సరాల్లో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం అన్నారు.
ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఒక్కో ఇంటి నిర్మాణానికి కేంద్రం నుంచి రూ.1.20 లక్షల ప్రాథమిక ఆర్థిక సాయం అందుతుందని కేంద్రమంత్రి పెమ్మసాని తెలిపారు. ఇతర పథకాల ద్వారా లభించే అదనపు ప్రయోజనాలను కలుపుకుంటే లబ్ధిదారులకు మొత్తం సాయం సుమారు రూ.1.70 లక్షల నుంచి రూ.1.80 లక్షల వరకు చేరుతుందని వివరించారు. అలాగే స్వచ్ఛ భారత్ అభియాన్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి అదనంగా రూ.12 వేల ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. దీంతో పేద కుటుంబాలకు ఇల్లు నిర్మించుకోవడంలో మరింత ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని పేర్కొన్నారు.
ప్రధానమంత్రి ఆవాస్ యోజన ప్రయోజనాలు మరింత మంది పేదలకు అందేలా కేంద్ర ప్రభుత్వం అర్హత నిబంధనల్లో కొన్ని మార్పులు చేసినట్లు కేంద్రమంత్రి తెలిపారు. కుటుంబ నెలసరి ఆదాయ పరిమితిని గతంలో ఉన్న రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచినట్లు చెప్పారు. అంతేకాకుండా ఇంట్లో బైక్, ఫ్రిజ్ వంటి




సాధారణ వస్తువులు ఉన్నంత మాత్రాన పథకానికి అనర్హులుగా పరిగణించకుండా నిబంధనలను సవరించినట్లు వివరించారు. ఈ మార్పులతో మరింత మంది అర్హులైన పేద కుటుంబాలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పరిధిలోకి వచ్చే అవకాశం ఉందన్నారు.
లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ఆవాస్ ప్లస్ యాప్‌ను ఉపయోగిస్తున్నట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. జియో ట్యాగింగ్ ద్వారా లబ్ధిదారుల వివరాలను నమోదు చేయడంతో పాటు.. ప్రజల సౌకర్యం కోసం సెల్ఫ్ సర్వే సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయాలకు తావు ఉండదని.. పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇళ్లు కేటాయించేలా ప్రక్రియ కొనసాగుతుందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.
తెలంగాణలో గతంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్ల కేటాయింపులు జరగలేదని కేంద్ర మంత్రి పెమ్మసాని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఇళ్ల కేటాయింపుపై కేంద్రాన్ని పలుమార్లు కోరారని తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణకు తాజాగా 2 లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో తెలుగు రాష్ట్రాల్లోని పేద కుటుంబాలకు సొంతింటి కల సాకారం చేసుకునే అవకాశం ఏర్పడనుంది.

# అల్లు అర్జున్ మామపై కేసు

**ముద్ర, హైదరాబాద్ :**
ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డికి భారీ షాక్ తగిలింది. హైదరాబాద్ నానక్ రామ్ గూడలోని ఐటీ కారిడార్‌లో చోటు చేసుకున్న భూవివాదం ఘటనలో ఆయనపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. నానక్ రామ్ గూడలోని 'మంత్రీ కాస్మోస్' భవన ప్రాంగణంలోకి కొందరు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి, అక్రమ ఆక్రమణలకు పాల్పడ్డారని 'మంత్రీ కాస్మోస్ ఓనర్స్ అసోసియేషన్' ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గేట్ల తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడటమే కాకుండా, అడ్డుకోబోయిన సెక్యూరిటీ సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేసి దౌర్జన్యానికి దిగారని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్, ఫోటో ఆధారాలను అసోసియేషన్ ప్రతినిధులు పెన్ డ్రైవ్‌లో భద్రపరిచి గచ్చిబౌలి పోలీసులకు అందజేశారు. దౌర్జన్యానికి పాల్పడిన చంద్రశేఖర్ రెడ్డితో పాటు ఆయన అనుచరులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐటీ కారిడార్‌లో పని చేసే ఉద్యోగులకు, నివాసితులకు రక్షణ కల్పించాలని కోరుతూ గచ్చిబౌలి పీఎస్‌తో పాటు తెలంగాణ డీజీపీ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, మాదాపూర్ డీసీపీ, గచ్చిబౌలి ఏసీపీలకు ఫిర్యాదు ప్రతులను పంపినట్లు అసోసియేషన్ వర్గాలు వెల్లడించాయి.

# నవంబర్ 19 నుంచి రూ. లక్ష సాయం

**ముద్ర, హైదరాబాద్ :**
రాజీవ్ యువ వికాసం పథకం విషయంలో కీలక అప్ డేట్ వెలువడింది. నవంబర్ 19 నుంచి రాజీవ్ యువ వికాసం పథకం కింద అర్హులకు రూ. లక్ష వరకు స్వయం ఉపాధి ఆర్థిక సాయం అందించేలా చర్యలు వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధికారులను ఆదేశించారు. ఇవాళ ప్రజా భవన్‌లో భట్టి విక్రమార్క, అడ్లూరి లక్ష్మణ్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల పనితీరుపై ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజీవ్ యువ వికాసంపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.



**స్వయం ఉపాధి కల్పనే మా లక్ష్యం**
ఇందిరమ్మ రాజ్యంలో పేద, బహుజన వర్గాల సంక్షేమం, విద్యాభివృద్ధి, యువతకు స్వయం ఉపాధి కల్పనే మా ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని విద్యారంగ అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూస్తామని భట్టి స్పష్టం చేశారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు కేంద్రీకృత వంటశాలల ఏర్పాటును వేగవంతం చేయాలని, పూర్వ విద్యార్థుల స్థితిగతులపై సమగ్ర అధ్యయనం చేపట్టాలని సూచించినట్లు భట్టి తెలిపారు. అలాగే స్టడీ సర్కిళ్ల ద్వారా అత్యుత్తమ శిక్షణ, ఎస్సీ డిగ్రీ కళాశాలల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఆధునిక కోర్సులను ప్రవేశపెట్టే దిశగా నిర్ణయాలు తీసుకున్నామని వెల్లడించారు.

# 'పదవుల' పండుగ

(మొదటి పేజీ తరువాయి)
ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఏఐసీసీ మార్గదర్శకాలు జారీ చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం నిర్వహించిన కులగణన నివేదికలను పరిగణనలోకి తీసుకుని, గతంలో పెద్దగా ప్రాతినిధ్యం దక్కని కులాలకు ఈసారి అవకాశాలు కల్పించే అవకాశం ఉందని సమాచారం. ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణ అమలు నేపథ్యంలో మాదిగ సామాజికవర్గానికి జనాభా నిష్పత్తికి అనుగుణంగా పదవులు కేటాయించాలన్న డిమాండ్లు కూడా పార్టీ ముందుకు వచ్చాయి.

**జిల్లాల నుంచి ఆశావహుల జాబితాలు**
పార్టీ కోసం క్షేత్రస్థాయిలో కష్టపడిన నాయకులను గుర్తించే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలుస్తోంది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రుల నుంచి అలాంటి నేతల జాబితాలను తెప్పించుకుని, వాటిని పరిశీలించిన అనంతరం తుది జాబితాను రూపొందించనున్నారు. దీంతో ఈసారి పదవుల కోసం కేవలం రాజకీయ సిఫార్సులే కాకుండా పార్టీకి చేసిన సేవ, సామాజిక ప్రాతినిధ్యం కూడా కీలకంగా మారనున్నాయి.

**పాతవారికి రెన్యువల్.. కొత్తవారికి ఛాన్స్**
ఇప్పటికే పదవీకాలం పూర్తయిన నిర్మలా జగ్గారెడ్డి, పటేల్ రమేశ్‌రెడ్డి, శివసేనారెడ్డి, మెట్టు సాయికుమార్, ఈరవత్రి అనిల్, బెల్లయ్య నాయక్, ప్రీతం, మల్‌రెడ్డి రాంరెడ్డి, నూతి శ్రీకాంత్ తదితరుల పేర్లు మరోసారి పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. శివసేనారెడ్డికి ఎమ్మెల్సీ అవకాశం దక్కకపోతే తిరిగి నామినేటెడ్ పదవి దక్కే అవకాశం ఉందన్న చర్చ కూడా కాంగ్రెస్ వర్గాల్లో వినిపిస్తోంది. మరోవైపు తొలిసారి నామినేటెడ్ పదవులు దక్కించుకునే నేతల సంఖ్య కూడా గణనీయంగా ఉండే అవకాశం ఉంది. దీంతో సెప్టెంబర్ నెలాఖరులోగా వెలువడే జాబితాపై కాంగ్రెస్ శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కులగణన, సామాజిక సమీకరణాలు, పార్టీకి చేసిన కృషి.. ఈ మూడు అంశాలే తుది జాబితాలో ఎవరికి చోటు దక్కుతుందో నిర్ణయించనున్నాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

# రూ.2వేల వరకు యూపీఐ చెల్లింపులు ఉచితం

**ముద్ర, న్యూఢిల్లీ:**
UPI వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక స్పష్టత ఇచ్చింది. రూ.2,000 వరకు జరిగే UPI లావాదేవీలపై బ్యాంకులు ఎలాంటి ఛార్జీలు విధించకూడదని స్పష్టం చేసింది. అలాగే రూ.2,000 వరకు RuPay డెబిట్ కార్డుల ద్వారా చేసే చెల్లింపులపైనా ఛార్జీలు వసూలు చేయడానికి వీలు లేదని తెలిపింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో ఈ విషయాన్ని పేర్కొంది. చెల్లింపులు చేసే లేదా స్వీకరించే వ్యక్తులపై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి ఛార్జీలు విధించకూడదని బ్యాంకులు, సిస్టమ్ ప్రొవైడర్లకు స్పష్టం చేసింది.
అదేవిధంగా, వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే P2P UPI లావాదేవీలు పూర్తిగా ఉచితంగానే కొనసాగుతాయని ప్రభుత్వం తెలిపింది. వ్యాపారులపై కూడా అన్ని UPI లావాదేవీలకు blanket MDR విధించబోమని స్పష్టం చేసింది. దీంతో చిన్న మొత్తాల డిజిటల్ చెల్లింపులు చేసే కోట్లాది మంది వినియోగదారులకు నిర్ణయం ఊరటనివ్వనుంది.







## బ్రిటన్ మూడు

# ముక్కలు

(మొదటి పేజీ తరువాయి)
బ్రిటన్ నుంచి విడిపోయింది. ఉత్తర ఐర్లాండ్ మాత్రం యూకేలో కొనసాగుతోంది. ఒకప్పుడు 'సూర్యుడు అస్తమించని సామ్రాజ్యం'గా పేరొందిన బ్రిటన్.. భారత్ సహా అనేక దేశాలను వలస పాలనలో ఉంచింది. అమెరికా కూడా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి 1776లో స్వాతంత్ర్యాన్ని ప్రకటించింది. కాలక్రమంలో బ్రిటిష్ సామ్రాజ్యం క్రమంగా కుంచించుకుపోయింది. ఇప్పుడు స్కాట్లాండ్‌లో స్వాతంత్ర్య డిమాండ్లు, ఉత్తర ఐర్లాండ్‌లో ఐర్లాండ్ ఏకీకరణపై చర్చలు బ్రిటన్ భవిష్యత్తుపై ఆసక్తిని పెంచుతున్నాయి. ముఖ్యంగా బ్రెగ్జిట్ తర్వాత ఈ చర్చలు మరింత ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఐర్లాండ్‌తో సంబంధాలపై చూపుతున్న ఆసక్తి కూడా చర్చనీయాంశంగా మారింది. అయితే ట్రంప్ ఐర్లాండ్ పర్యటనను నేరుగా బ్రిటన్‌ను విభజించే వ్యూహంగా చెప్పడం ఇప్పటికైతే తొందరపాటు నిర్ణయమే.
అయితే ఒకప్పుడు ఇతర దేశాలపై ఆధిపత్యం చెలాయించిన బ్రిటన్.. ఇప్పుడు తనలోని జాతీయతలను ఎలా సమన్వయం చేసుకుంటుందన్నదే అసలు ప్రశ్న. యూకే భవిష్యత్తులోనూ యునైటెడ్‌గానే ఉంటుందా? లేక స్కాట్లాండ్, ఉత్తర ఐర్లాండ్ పరిణామాలతో కొత్త రాజకీయ పటం ఆవిర్భవిస్తుందా? దీనిపై 'రామ్' గారి విశ్లేషణ ఆసక్తికరంగా మారింది.

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

బుధవారం 16.09.2026

www.mudranews.in | @mudranews



### జలుబు రాకుండా తగినంత నిద్రపోండి

రోజూ సరిపడా నిద్ర తీసుకోవడం రోగనిరోధక వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి సహాయపడుతుంది. పెద్దలు సాధారణంగా 7–9 గంటల నిద్రకు ప్రాధాన్యం ఇవ్వాలి.




## 'ఇందిరమ్మ ఇండ్లు టవర్స్' దరఖాస్తు గడువు పెంపు

**ముద్ర, హైదరాబాద్:** హైదరాబాద్ క్యూర్ పరిధిలోని ప్రజల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకం కింద నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 20 వరకు పొడిగించారు. రెండో శనివారం, ఆదివారం, పండుగలు, ఇతర వరుస సెలవుల కారణంగా దరఖాస్తుల గడువును పొడిగించాలని వివిధ వర్గాల నుంచి విజ్ఞప్తులు అందాయి. వాటిని పరిశీలించిన అనంతరం దరఖాస్తుల స్వీకరణ గడువును 20 వరకు పొడిగించాలని నిర్ణయించినట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌసింగ్ కమిషనర్ వీపీ గౌతమ్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో భాగంగా తొలుత 16 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి దరఖాస్తులను స్వీకరించి.. లాటరీ ద్వారా ఇండ్ల కేటాయింపు ప్రక్రియను కూడా పూర్తిచేశారు. ప్రస్తుతం మరో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలైన చాంద్రాయణగుట్ట, ఎల్ బీ నగర్, ముషీరాబాద్, గోషామహల్ పరిధిలో నిర్మించనున్న టవర్లలోని ఇండ్ల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ ముగిసినప్పటికీ ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, వరుస సెలవులు, పండుగలను దృష్టిలో ఉంచుకొని గడువును పొడిగించినట్లు కమిషనర్ పేర్కొన్నారు. సంబంధిత నాలుగు నియోజకవర్గాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పథకానికి సంబంధించిన అర్హత ప్రమాణాలు, ఇతర నిబంధనల్లో ఎటు వంటి మార్పు లేదని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు tghb.telangana.gov.in వెబ్ సైట్ ను సందర్శించవచ్చని.. లేదా తెలంగాణ హౌసింగ్ బోర్డు కాల్ సెంటర్ నంబర్ 040-24603572 నంబర్ లో సంప్రదించవచ్చని సూచించారు.

## కోట్ల ఫ్లాట్లు.. గుక్కెడు నీటి కోసం తిప్పలు





**ముద్ర, విశాఖపట్నం :** విశాఖపట్నం మధురవాడ పీఎం పాలెం స్టేడియం ఎదురుగా 10 ఎకరాల్లో నిర్మించిన భారీ అపార్ట్మెంట్‌లో నీటి సమస్య తలెత్తింది. 12 టవర్లు, 15 అంతస్తులతో నిర్మించిన 1,428 ఫ్లాట్లలో సుమారు 1,200 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఒక్కో ఫ్లాట్‌కు రూ.75 లక్షల నుంచి రూ.1.50 కోట్ల వరకు ఖర్చు చేసిన నివాసితులు ప్రస్తుతం తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. దీంతో 'వుయ్ వాంట్ వాటర్' అంటూ సోషల్ మీడియాలో వీడియోలు, రీల్స్ ద్వారా నిరసన వ్యక్తం చేస్తున్నారు. అయితే కోట్ల రూపాయలు వెచ్చించి ఫ్లాట్ కొనుగోలు చేసే ముందు నీటి సరఫరా, మౌలిక సదుపాయాలపై పూర్తిస్థాయిలో పరిశీలన చేశారా? అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. డెవలపర్ బాధ్యతతో పాటు సంబంధిత అధికారుల పర్యవేక్షణ, కొనుగోలుదారుల అవగాహన లోపం కూడా ఇలాంటి పరిస్థితులకు కారణమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## రాయ్‌బరేలీలో శివ మహాపురాణ కథకు తెలంగాణ గవర్నర్ హాజరు



**ముద్ర, ఢిల్లీ :** ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త పండిట్ ప్రదీప్ మిశ్రా జీ నిర్వహించిన పవిత్ర "శ్రీ శివ మహాపురాణ కథ" కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆధ్యాత్మిక సంప్రదాయానికి గౌరవం తెలిపారు. భక్తి, ధర్మం, మానవ సేవ వంటి శాశ్వత విలువలను చాటే సందేశాన్ని ఆయన స్మరించుకు న్నారు. ఈ కార్యక్రమాన్ని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ ఆహార, లాజిస్టిక్స్ మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి శ్రీ మనోజ్ కుమార్ పాండే ఆధ్వర్యంలో నిర్వహించారు.

## 22ఏ పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు: కేటీఆర్



**ముద్ర, హైదరాబాద్:** 22ఏ నిషేధిత జాబితా పేరుతో లక్షల ఎకరాల భూములను, వేలాది కాలనీలు, ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రజల సొమ్మును దోచుకోవడానికి 22ఏ నిబంధనలను అడ్డుపెట్టుకోవద్దని ఆయన డిమాండ్ చేశారు. 30 శాతం కమీషన్ కోసం చేస్తున్న చిల్లర ప్రయత్నాలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని కేటీఆర్ అన్నారు. ఏళ్లుగా ప్రజలు నివసిస్తున్న కాలనీలు, ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. 22ఏ జాబితా విషయంలో ప్రజలకు స్పష్టత ఇవ్వడంతో పాటు, తప్పుగా చేర్చిన భూములు, కాలనీలు, ఇళ్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసినందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే క్షమాపణ చెప్పాలని కేటీఆర్ కోరారు.

## రైతు నేస్తం 107వ ఎపిసోడ్‌లో ప్రకృతి వ్యవసాయ కిట్ల పంపిణీ




**ముద్ర, హైదరాబాద్ :** 'రైతు నేస్తం' 107వ ఎపిసోడ్‌లో భాగంగా జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కింద రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లను వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్రమోహన్ పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, రైతులు నేరుగా వినియోగదారులకు విక్రయిస్తే అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. సేంద్రియ రైతుల కోసం రూపొందించిన 'టీజీ ఆర్గానిక్స్' యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఏడు రకాల సన్న వరి రకాలకు క్వింటాలుకు రూ.500 బోనస్ నేపథ్యంలో రైతులు విత్తనాల కొనుగోలు వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. డిజిటల్ క్రాప్ బుకింగ్‌లో పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు.

# సీఎం రేవంత్‌తో విభేదాల్లేవు..

- కానీ కొండా సురేఖను తొలగించడం బాధించింది
- కేబినెట్ విస్తరణపై మహేష్ గౌడ్ కీలక వ్యాఖ్యలు
- వచ్చే ఎన్నికల్లో 14-15 ఎంపీ సీట్లు లక్ష్యం
- రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం



**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి గొడవల్లేవ్ అని ఎమ్మెల్సీ, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉండటం సహజమేనన్నారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించినందుకు ఓ బీసీ బిడ్డగా బాధపడ్డానని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేంద్రం కుల గణన సర్వేను తొక్కిపెట్టడం దురదృష్టకరమని, తాము కేంద్రంలో అధికారంలోకి వస్తే దేశ వ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేస్తామన్నారు.

**కొండా సురేఖ విషయంలో బాధపడ్డా..**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో చిట్‌చాట్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తప్పించడంపై స్పందించారు. కొండా సురేఖ బర్తరఫ్ నిర్ణయం బాధాకరమే అయినప్పటికీ, పార్టీ క్రమశిక్షణ దృష్ట్యా ఏఐసీసీ (AICC) ఈ కఠిన నిర్ణయం తీసుకోక తప్పలేదని స్పష్టం చేశారు. అధిష్ఠానం వద్ద తాము ఈ చర్యను ఆపడానికి ప్రయత్నించినప్పటికీ, వ్యవహారం సీరియస్‌గా ఉండటంతో తుది నిర్ణయం కేంద్ర నాయకత్వమే తీసుకుందని తెలిపారు. తన నాయకత్వంలో తెలంగాణ కాంగ్రెస్ ఏఐసీసీ ర్యాంకింగ్స్ లో దేశంలోనే నెంబర్ వన్ స్థానానికి చేరిందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 14-15 సీట్లు గెలవడమే లక్ష్యమని పీసీసీ చీఫ్ తెలిపారు. పార్టీ లైన్ దాటితే ఎంతటి వారైనా చర్యలు తప్పవన్నారు. బీసీలకు కేబినెట్‌లో 5 స్థానాలు కోరానని, వచ్చే ఎన్నికల్లో తాను నిజామాబాద్ నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక లక్షలాది మంది పేదలకు రేషన్ కార్డులు ఇచ్చిందని గుర్తుచేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఫోర్త్ సిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నారని.. ప్రతిపక్ష బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తుందంట మండిపడ్డారు. ఆక్రమణల నుంచి చెరువులను కాపాడటంలో హైడ్రా విజయం సాధించిందన్నారు. హైడ్రా రాకతో భూకబ్జాదారులు, ఆక్రమణదారుల్లో భయం మొదలైందని అన్నారు.

**కేబినెట్ విస్తరణపై స్పష్టత**

రాష్ట్రంలో కేబినెట్ విస్తరణపై జరుగుతున్న ప్రచారంపై స్పందిస్తూ, ప్రస్తుతం మంత్రివర్గ విస్తరణ లేనట్లేనని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఢిల్లీ పర్యటనలో కేవలం కొండా సురేఖ, చిన్నారెడ్డికి సంబంధించిన అంశాలపై మాత్రమే అధిష్ఠానంతో చర్చలు జరిగాయని తెలిపారు. రాష్ట్ర కేబినెట్ విస్తరణ అంశం ఎజెండాలో లేదని తేల్చి చెప్పారు. మంత్రివర్గ విస్తరణ అనేది పూర్తిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ అధిష్టానం నిర్ణయమని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డితో ఎలాంటి గొడవలు లేవని, అభిప్రాయ భేదాలు వచ్చినా సాయంత్రానికే సరిచేసుకుంటామన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్లు ఎంతో ఉత్సాహంగా గడిచాయని పేర్కొన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ ముందున్న లక్ష్యమన్నారు. కులగణన సర్వే ఫలాలు అందరికీ అందితే సామాజిక న్యాయం జరుగుతుందని తెలిపారు.

## హైదరాబాద్‌కు నాలుగు వైపులా బస్ టెర్మినల్స్



**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, వాహన కాలుష్యాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రజా రవాణా ప్రణాళికను రూపొం దిస్తోంది. నగరానికి నలువైపులా ఆధునిక బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేసి, అంతర్‌జిల్లా, అంతర్రాష్ట్ర బస్సులను నగర శివార్లలోనే నిలిపేలా చర్యలు చేపడుతున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గాజులరామారం, శంషాబాద్, ఎల్బీ నగర్, ఘట్కేసర్ ప్రాంతాల్లో టెర్మినల్స్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలి స్తోంది. గాజులరామారం వద్ద సుమారు 100 ఎకరాలు, శంషాబాద్ వైపు 150 ఎకరాల భూమిని కేటాయించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. టెర్మినల్స్ నుంచి ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకునేలా సిటీ బస్సులు, మెట్రో, ఎంఎంటీఎస్ సేవలను అనుసంధానిం చనున్నారు. రానున్న 2,200 ఎలక్ట్రిక్ బస్సులను కూడా ఈ వ్యవస్థకు అనుగుణంగా వినియోగించనున్నారు. ప్రైవేట్ బస్సులను సైతం నిర్దేశిత టెర్మినల్స్ నుంచే నిర్వహించే విధానాన్ని పరిశీలిస్తున్నారు. దూరప్రాంత బస్సులు నగరంలోని రద్దీ ప్రాంతాల్లోకి రాకుండా శివార్లలోనే నిలిపితే ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి, కాలుష్యం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పార్కింగ్, ప్రయాణికుల వేచిచోట్లతో ఆధునిక సౌకర్యాలతో టెర్మినల్స్‌ను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు.

## న్యాయవ్యవస్థపై విమర్శలు తప్పుకాదు

**- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్**



**ముద్ర, హైదరాబాద్ :** న్యాయ వ్యవస్థ అనేది విమర్శలకు, పరిశీలనకు అతీతమైనదేమీ కాదని రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో న్యాయస్థానాల పనితీరుపై వచ్చే సరైన విమర్శలు, సూచనలు జవాబుదారీతనాన్ని పెంచడానికి ఎంతో అవసరమని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై విమర్శలు అవసరమేనని, న్యాయవ్యవస్థను ప్రశ్నించొచ్చు.. విమర్శించొచ్చన్నారు. ప్రజా విశ్వాసమే న్యాయ వ్యవస్థకు అసలైన బలమని ఆయన పేర్కొన్నారు. నిన్న ఢిల్లీలో జరిగిన రామ్ జెఠ్మలానీ 6వ సంస్మరణ ఉపన్యాస కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. న్యాయ వ్యవస్థ పరిశీలనకు అతీతంగా ఉండలేదని వ్యవస్థ పనితీరుపై వచ్చే నిర్మాణాత్మక, ఆధారసహిత విమర్శలు ప్రజాస్వామ్యానికి మేలు చేస్తాయన్నారు. ఇవి సంస్థాగత జవాబుదారీతనానికి, తప్పులను దిద్దుకోవడానికి దోహదపడతాయని వ్యాఖ్యానించారు.

**ప్రజా విశ్వాసమే అసలైన బలం:**

కార్యనిర్వాహక వ్యవస్థ, శాసన వ్యవస్థల మాదిరిగా న్యాయ వ్యవస్థకు సైన్యం లేదా ఆర్థిక అధికారాలు ఉండవని, ప్రజలు ఇచ్చే నమ్మకం, విశ్వాసమే న్యాయస్థానాల అసలైన అధికార శక్తి అని వివరించారు. ఈ విశ్వాసాన్ని ప్రతిరోజూ, ప్రతి కేసులోనూ నిలబెట్టుకోవాల్సి ఉంటుందన్నారు. కేవలం తీర్పు ఇవ్వడమే పారదర్శకత అనిపించుకోదని, ఆ తీర్పు వెనుక ఉన్న స్పష్టమైన కారణాలను వెల్లడించినప్పుడే నిజమైన పారదర్శకత సాధ్యమవుతుందని చెప్పారు. ప్రజల మెప్పు పొందడం వేరు, ప్రజా విశ్వాసాన్ని గెలుచుకోవడం వేరని స్పష్టం చేశారు.

**మార్పులు, సంస్కరణలు తప్పనిసరి:**

ఏ వ్యవస్థ అయినా నిశ్చలంగా ఉండిపోకూడదని కాలానికి అనుగుణంగా సంస్కరణలు చేపట్టడం తప్పనిసరి అని సీజేఐ పేర్కొన్నారు. న్యాయవ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, సంస్కరణలు నిరంతరం కొనసాగాలన్నారు. అదే సమయంలో కొన్ని పాలనాపరమైన, అంతర్గత విషయాలను బహిరంగంగా చర్చించడం సమంజసం కాదని వ్యాఖ్యానించారు. జడ్జిలపై వచ్చే ఫిర్యాదుల వ్యవహారంలో ప్రస్తుత విధానం పటిష్టంగానే ఉందని సీజేఐ వెల్లడించారు. కాగా న్యాయ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, న్యాయమూర్తుల నియామకాలు, విమర్శలపై విస్తృత చర్చ జరుగుతున్న తరుణంలో సీజేఐ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

# హౌసింగ్ ఫర్ ఆల్ లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళిక

**2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్లను పూర్తి చేయాలి**
**కేంద్ర సహకారంతో ఇండస్ట్రియల్ టౌన్ షిప్ ల నిర్మాణం**
**గృహ నిర్మాణ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం**



**ముద్ర, అమరావతి :** రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి 2029 నాటికి సురక్షితమైన, శాశ్వతమైన ఇల్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం హౌసింగ్ ఫర్ ఆల్ కార్యక్రమాన్ని సంతృప్తి స్థాయిలో అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. 2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. గృహ నిర్మాణ శాఖపై క్యాంపు కార్యాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్, పీఎం జన్ మన్ సహా వివిధ పథకాల కింద చేపట్టాల్సిన ఇళ్ల నిర్మాణాన్ని వచ్చే నెలలోగా గ్రౌండింగ్ చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 1.5 లక్షల ఇళ్లను పట్టణ ప్రాంతాల్లోనూ నిర్మాణం చేయాలని సీఎం సూచించారు. డిసెంబరు 2026 నాటికల్లా 2.05 లక్షల ఇళ్లు, 2027 మార్చి నాటికి మరో 2.74 లక్షల ఇళ్లు పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. పీఎంఏవై 1.0, పీఎంఏవై 2.0, పీఎం జన్ మన్ పథకాల కింద రాష్ట్రంలో 18.72 లక్షల ఇళ్ల మంజూరు కాగా.. ఇప్పటి వరకూ 13.20 లక్షల ఇళ్లు పూర్తి అయ్యాయని అధికారులు వివరించారు. ఏపీ హౌసింగ్ కార్పోరేషన్ పరిధిలో మొత్తం 16.11 లక్షల ఇళ్లకు గానూ ఇప్పటికే 11.31 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి అయిందన్నారు. ఏపీ టిడ్కో పరిధిలో 2.61 లక్షల ఇళ్లకు గానూ 1.88 లక్షల ఇళ్లు పూర్తి అయ్యాయని సీఎంకు వివరించారు. 2027 డిసెంబరు నాటికి 75 వేల కొత్త గృహాలను మంజూరు అయ్యేలా చూడటంతో పాటు 1.5 లక్షల ఇళ్లను పైప్ లైన్ లోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి సూచించారు. దీనికి సంబంధించి కేంద్ర గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి శాఖలతో సమన్వయం చేసుకుని అవసరమైన కేటాయింపులు పొందాలని సీఎం స్పష్టం చేశారు.

**ఉచిత ఇళ్ల స్థలాలపై ప్రత్యేక కార్యాచరణ**

ఇంటి స్థలాలు లేని కుటుంబాల వాస్తవ డిమాండ్‌ను గుర్తించేందుకు ఆర్టీజీఎస్ సహా ఆవాస్ ప్లస్, హౌసింగ్, రెవెన్యూ శాఖల నుంచి డేటాను అనుసంధానం చేసుకుని డూప్లికేషన్ లేకుండా అర్హులను గుర్తించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రాథమిక లబ్ధిదారుల జాబితాలను ప్రచురించి అభ్యంతరాలను స్వీకరించి పారదర్శకంగా పరిష్కరించిన అనంతరం తుది జాబితాలను ఖరారు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే ఉన్న లే అవుట్లలో నిర్మాణాలు చేపట్టని భూమిని అవసరానికి అనుగుణంగా 2 లేదా 3 సెంట్ల ప్లాట్లుగా పునర్వ్యవస్థీకరించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఖాళీ స్థలాల గుర్తింపు, అర్హులైన లబ్ధిదారులకు మ్యాపింగ్, నిర్మాణం పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సీఎం సూచించారు. కుప్పం నియోజకవర్గంలోనూ సాచురేషన్ విధానంలో గృహ నిర్మాణం చేపట్టాలన్నారు. 2029 నాటికి రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సురక్షితమైన, శాశ్వతమైన ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. శాఖల మధ్య సమన్వయంతో అందరికీ ఇళ్లు లక్ష్యాన్ని పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.

**పారిశ్రామిక టౌన్ షిప్ ల నిర్మాణం**

కేంద్ర సహకారంతో వివిధ ప్రాంతాల్లో పారిశ్రామిక టౌన్ షిప్ లను నిర్మించే అంశంపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి గృహ నిర్మాణ శాఖను ఆదేశించారు. రాష్ట్రంలోని శ్రీసిటీ సహా వివిధ పారిశ్రామిక ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ టౌన్ షిప్ ల ఏర్పాటు ద్వారా ఆర్థిక లావాదేవీలు పెరిగేందుకు ఆస్కారం ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ ఏపీఐఐసీతో సమన్వయం చేసుకుని ఈ టౌన్ షిప్ ల నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, హౌసింగ్ శాఖ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in @mudranews mudratv
బుధవారం 16.09.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com




## మన కడప రెడ్డమ్మ
# ఉగ్రరూపం
### ఆసియా కప్ సులభంగా టీమిండియా చేతుల్లోకి..



మహిళల ఆసియా కప్ 2026 టోర్నీలో తెలుగు సంచలనం శ్రీచరణి సత్తా చాటింది. ఏకంగా నాలుగు వికెట్లు పడగొట్టి సరికొత్త చరిత్ర సృష్టించింది. తద్వారా శ్రీలంక జట్టు బెంబేలెత్తిపోయింది. ఫలితంగా ఆసియా కప్ ట్రోఫీ టీం ఇండియా చేతుల్లోకి దర్జాగా వచ్చేసింది. ఏపీలోని కడపకు చెందిన శ్రీచరణి అంతర్జాతీయంగా బాగా రాణిస్తోంది. దీంతో ఆమెను ముద్దుగా రాయలసీమ, ఏపీ వాసులు 'కడప రెడ్డమ్మా' అని ముద్దుగా పిలుస్తారు. ఇప్పుడు కడప అమ్మాయి సత్తాచాటుతోంది.

ఫైనల్ మ్యాచ్లో హర్మన్ ప్రీత్ కౌర్ నాయకత్వంలో టీమిండియా సమిష్టిగా రాణించింది. తద్వారా ఎనిమిదవ టైటిల్ తన ఖాతాలో వేసుకుంది. దుబాయ్ వెహికల్ గా జరిగిన ఫైనల్ మ్యాచ్లో శ్రీలంక జట్టుపై భారత ప్లేయర్లు సూపర్ ఆట తీరుతో ఆకట్టుకున్నారు. ఏకంగా 72 పరుగుల తేడాతో ప్రత్యర్థి జట్టును మట్టి కరిపించారు. భారత ఓపెనర్లు స్మృతి మందాన, షెఫాలీ వర్మ అదరగొట్టారు. వీరిద్దరి విధ్వంసానికి తెలుగుతేజం శ్రీ చరణి(4/20) తోడు కావడంతో.. శ్రీలంక జట్టు ఆశలు అడుగంటిపోయాయి.

ఈ మ్యాచ్‌లో ముందుగా భారత్ బ్యాటింగ్ చేసింది. 20 ఓవర్ల పాటు పూర్తి స్థాయిలో బ్యాటింగ్ చేయగలిగింది. ఐదు వికెట్లు మాత్రమే కోల్పోయి 183 పరుగుల భారీ స్కోర్ చేయగలిగింది. స్మృతి కేవలం 39 బంతుల్లోనే 59 పరుగులు చేసింది. వర్మ 39 బంతుల్లో 68 పరుగులు చేసింది. శ్రీలంక జట్టు తరుపున మిథాలి అయోధ్య.. చమరి ఆటపట్టు, చముడి ప్రబోధ తలా ఒక వికెట్ పడగొట్టారు.

ఆ తర్వాత శ్రీలంక జట్టు బ్యాటింగ్ మొదలుపెట్టింది. కేవలం 11 పరులపై కుప్పకూలింది. చమరి 36 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచింది. నీలాక్షిక సిలువ 22 పరుగులు చేసింది. అయితే మిగతా బ్యాటర్లు దారుణ విఫలం కావడంతో శ్రీలంక ఓటమి తప్పలేదు భారత జట్టు బౌలర్లలో శ్రీ చరణి నాలుగు వికెట్లు పడగొట్టి శ్రీలంక జట్టు పతనాన్ని శాసించింది. దీపి శర్మ మూడు వికెట్లు దక్కించుకుంది. క్రాంతి గౌడ్.. వర్మ.. ప్రేమ తలా ఒక వికెట్ సొంతం చేసుకున్నారు.

ఈ మ్యాచ్లో టాస్ గెలవడం భారత జట్టుకు అనుకోని వరంలాగా మారింది. ఓపెనర్లు దిమ్మ తిరిగే స్థాయిలో బ్యాటింగ్ చేశారు. ప్రారంభం నుంచే శ్రీలంక బౌలర్ల మీద ఎదురుదాటికి దిగారు. వర్మ.. మందాన నువ్వా నేనా అన్నట్టుగా పోటీపడి పరుగులు చేశారు. దీంతో పవర్ ప్లే పూర్తయ్యే సమయానికి భారత్ ఒక వికెట్ కూడా కోల్పోకుండా 57 పరుగులు చేసింది. వర్మ 24 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేయగా.. స్మృతి 35 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసింది. తొలి వికెట్లు టీమ్ ఇండియా 129 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పింది. అయితే ఈ జోడిది ప్రబోధ విడదీసింది. ఆ తర్వాత స్మృతి కూడా అవుట్ కావడంతో భారత స్కోర్ వేగం కాస్త మందగించింది. కానీ మిగతా బ్యాటర్లు సత్తా చాటడంతో టీమిండియా భారీ స్కోర్ చేయగలిగింది.




# ఒక్క యాడ్‌కు రూ.2 కోట్లు
## 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ

భారత క్రికెట్‌లో ఓ యువ ఆటగాడు ఒక్కసారిగా సంచలనంగా మారితే.. అతని ఆటతో పాటు అతడి మార్కెట్ విలువ కూడా అమాంతం పెరుగుతుంది. ఇప్పుడు అలాంటి క్రేజ్‌నే సొంతం చేసుకున్నాడు 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ. ఐపీఎల్‌లో తనదైన ముద్ర వేసిన ఈ కుర్ర క్రికెటర్ పేరు ఇప్పుడు మైదానానికే పరిమితం కాలేదు. మీడియా, సోషల్ మీడియా, బ్రాండ్ల దృష్టి కూడా అతడిపై పడింది.

**రూ.1.5–2 కోట్ల మార్కెట్ విలువ**

ప్రైవేట్ సంస్థలు రూపొందించిన కొన్ని మార్కెట్ అంచనాల ప్రకారం వైభవ్ సూర్యవంశీకి ప్రస్తుతం సుమారు రూ.1.5 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు మార్కెట్ విలువ ఉందని చెబుతున్నారు. అయితే ఇక్కడ ఓ ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి. ఇది వైభవ్ ప్రస్తుతం సంపాదిస్తున్న జీతం కాదు. అతడి బ్యాంక్ ఖాతాలో రోజుకు రూ.1.5–2 కోట్లు జమ అవుతున్నాయని కూడా దీని అర్థం కాదు. ఈ సంఖ్య అతడి బ్రాండ్ ఇమేజ్, మార్కెట్ డిమాండ్, ఇమేజ్ రైట్స్, ప్రకటనల సామర్థ్యం వంటి అంశాలను ఆధారంగా చేసుకున్న అంచనా మాత్రమే.

**ఒక్క యాడ్ ఫిల్మ్‌కు కోట్లు?**

వైభవ్‌కు పెరుగుతున్న పాపులారిటీ కారణంగా అతడు ఒక ప్రకటన లేదా ఎండార్స్‌మెంట్ కోసం రూ.1.5 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు ఛార్జ్ చేసే స్థాయికి చేరుకున్నాడనే ప్రచారం జరుగుతోంది. ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు ఈ స్థాయి మార్కెట్ డిమాండ్ అతడికి లేదు. కానీ ఐపీఎల్‌లో మెరుపు ప్రదర్శనలతో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా గుర్తింపు రావడంతో పరిస్థితి మారిపోయింది. అంటే.. 15 ఏళ్ల క్రికెటర్‌కు వచ్చిన అసలు మార్పు కేవలం పరుగులు, రికార్డుల్లోనే కాదు. అతడి బ్రాండ్ విలువలోనూ భారీగా కనిపిస్తోంది.

భారత క్రికెట్‌లో ఐపీఎల్ కేవలం టోర్నమెంట్ కాదు. యువ ఆటగాళ్లకు ఇది ఒక భారీ వేదిక. ఒక సీజన్‌లోనే దేశవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానుల దృష్టిని ఆకర్షించే అవకాశం ఉంటుంది. వైభవ్ విషయంలోనూ అదే జరిగింది. అతడి ఆటకు వచ్చిన మీడియా కవరేజ్, సోషల్ మీడియా చర్చలు, అభిమానుల్లో పెరిగిన ఆసక్తి.. ఇవన్నీ కలిపి అతడిని యువ క్రికెటర్లలో ప్రత్యేకమైన బ్రాండ్‌గా నిలబెట్టాయి. ఇక క్రికెట్‌లో స్టార్‌డమ్ ఎంత వేగంగా వస్తుందో.. అదే స్థాయిలో మార్కెట్ విలువ కూడా మారిపోతుంది. అందుకే వైభవ్‌పై బ్రాండ్లు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది.

**చదువుకంటే క్రికెట్‌కే ప్రాధాన్యం**

వైభవ్ క్రికెట్‌పై ఉన్న నిబద్ధతకు మరో ఉదాహరణగా అతడు 10వ తరగతి పరీక్షలను కూడా వదులుకుని క్రికెట్‌పై దృష్టి పెట్టిన విషయం ప్రస్తావనకు వస్తోంది. చిన్న వయసులోనే ప్రొఫెషనల్ క్రికెట్‌పై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టడం అతడి కెరీర్‌లో కీలక నిర్ణయంగా మారింది. ఇప్పుడు అదే నిర్ణయం అతడిని దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మార్చింది. అయితే ఇలాంటి వయసులో వచ్చే భారీ గుర్తింపు, ఆర్థిక అవకాశాలతో పాటు ఒత్తిడి కూడా పెరుగుతుంది. అందుకే వైభవ్‌కు ముందున్న సవాలు కేవలం మరిన్ని పరుగులు చేయడం మాత్రమే కాదు.. ఈ అంచనాలను తట్టుకుని స్థిరంగా రాణించడం కూడా.

**రూ.2 కోట్ల కథ కంటే ముఖ్యమైనది..**

వైభవ్ సూర్యవంశీకి ఒక్కో ప్రకటనకు రూ.1.5–2 కోట్లు వస్తున్నాయన్న వార్త ఆసక్తికరంగా ఉన్నప్పటికీ, దానిని అతడి నిర్ధారిత రోజువారీ ఆదాయంగా చూడటం సరికాదు. అసలు ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. కేవలం 15 ఏళ్ల వయసులోనే అతడి పేరు క్రికెట్ మార్కెట్‌లో ఒక విలువైన బ్రాండ్‌గా మారడం. నిన్నటి వరకు భవిష్యత్తు స్టార్‌గా కనిపించిన వైభవ్.. ఇప్పుడు ఇప్పటికే భారీ బ్రాండ్ డిమాండ్ ఉన్న యువ క్రికెటర్‌గా మారాడు. రాబోయే సీజన్లలో అతడి ఆట ఇదే స్థాయిలో కొనసాగితే, ఈ మార్కెట్ విలువ మరింత పెరిగే అవకాశాలు లేకపోలేదు.

ఒక్క మాటలో చెప్పాలంటే.. వైభవ్ సంపాదిస్తున్న మొత్తం ఎంత అన్నదానికంటే 15 ఏళ్లకే అతడి పేరు ఎంత విలువైన బ్రాండ్‌గా మారిందన్నదే ఇప్పుడు అసలు చర్చ.

## టీ20 క్రికెట్లో ఫాస్టెస్ట్
# హాఫ్ సెంచరీ

అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో అతి తక్కువ బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించిన రికార్డు ఎవరి పేరు మీద ఉందనే చర్చ క్రికెట్ సర్కిల్స్‌లో ఎప్పుడూ నడుస్తూనే ఉంటుంది. ప్రస్తుతం భారత యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ, విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ పేర్లు ఈ చర్చలో ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఈ ఏడాది న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 14 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాదిన అభిషేక్ శర్మ.. టీ20ల్లో అత్యంత వేగంగా ఫిఫ్టీ కొట్టిన ఆటగాళ్ల జాబితాలో సంయుక్తంగా నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. అయితే ఈ రికార్డులన్నింటిని తలదన్నేలా అగ్రస్థానంలో ఉన్న ఒక అసాధారణ రికార్డును బద్దలు కొట్టడం భవిష్యత్తులో ఏ ఆటగాడికైనా అంత సులభం కాదనే చెప్పాలి.




**ప్రపంచ రికార్డు ఎవరి పేరు మీద ఉంది?**

అంతర్జాతీయ టీ20 క్రికెట్ చరిత్రలోనే ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ సాధించిన ప్రపంచ రికార్డు నేపాల్ జట్టుకు చెందిన దీపేంద్ర సింగ్ ఐరీ (Dipendra Singh Airei) పేరు మీద ఉంది. సెప్టెంబర్ 27, 2023న మంగోలియాపై జరిగిన మ్యాచ్‌లో దీపేంద్ర సింగ్ కేవలం 9 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి సంచలనం సృష్టించాడు. టీ20 క్రికెట్‌లో 10 లేదా అంతకంటే తక్కువ బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించిన ప్రపంచంలోని ఏకైక బ్యాటర్ ఆయనే కావడం విశేషం. ఆ మ్యాచ్‌లో నేపాల్ జట్టు ఏకంగా 273 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఇదే మ్యాచ్‌లో నేపాల్‌కు చెందిన కుశాల్ మల్లా కేవలం 50 బంతుల్లోనే 137 పరుగులు చేసి మరో రికార్డు సృష్టించాడు.

**రెండో స్థానంలో యువరాజ్ సింగ్**

ఈ జాబితాలో టీమిండియా దిగ్గజ ఆల్ రౌండర్ యువరాజ్ సింగ్ సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాడు. 2007 టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన చారిత్రాత్మక మ్యాచ్‌లో స్టువర్ట్ బ్రాడ్ బౌలింగ్‌లో వరుసగా 6 సిక్సర్లు బాదిన యువీ, కేవలం 12 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. ఆస్ట్రియాకు చెందిన అబ్దుల్లా కోట్వా కూడా 12 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసి ఈ జాబితాలో యువీతో కలిసి సంయుక్త రెండో స్థానాన్ని పంచుకుంటున్నాడు.

**వైభవ్ సూర్యవంశీకి సవాల్‌గా మారిన రికార్డులు**

ఇంగ్లాండ్ పర్యటనతో టీ20ల్లో అడుగుపెట్టిన యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ, ఆ తర్వాత జింబాబ్వే టూర్‌లో కేవలం 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాది తన సత్తా చాటాడు. భవిష్యత్తులో అతను మరెన్నో రికార్డులు బద్దలు కొట్టే అవకాశం ఉన్నప్పటికీ, 9 బంతుల్లో ఫిఫ్టీ సాధించిన దీపేంద్ర సింగ్ రికార్డును అందుకోవడం మాత్రం ఏ బ్యాటర్‌కైనా అత్యంత కష్టతరమైన సవాల్‌గానే నిలుస్తుంది.

# నఖ్వీకి మళ్లీ అవమానం

సరిహద్దుల్లో పారించిన రక్తం ఇంకా పచ్చిగానే ఉంది. చేసిన గాయాలు.. చోటు చేసుకున్న దారుణాలు.. కోల్పోయిన ప్రాణాలు.. ఇవన్నీ కళ్ళ ముందు కనిపిస్తుంటే వాటిని మరిచిపోయి ఎలా ముందుకు వస్తారు.. చిరునవ్వులు చిందిస్తూ ట్రోఫీ ఎలా తీసుకుంటారు.. అలా తీసుకుంటే వాళ్లు మన భారతీయ మహిళలు ఎలా అవుతారు..

ఆసియా కప్ లో శ్రీలంక మీద భారత్ గెలిచి.. విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో వీరోచితమైన పోరాటం చేసి అదరగొట్టింది. ఈ నేపథ్యంలో ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు హోదాలో పాకిస్తాన్ క్రికెట్ సంఘ అధ్యక్షుడు మోసిన్ నఖ్వీ ట్రోఫీ అందించేందుకు ముందుకు వచ్చారు. వాస్తవానికి ఈ విషయం భారత క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్ కౌర్‌కు తెలియదు. డ్రెస్సింగ్ రూం నుంచి.. తోటి మహిళా క్రికెటర్లతో ఆమె స్టేడియంలోకి అడుగుపెట్టింది. నఖ్వీని చూసి వెనకడుగు వేసింది.

బీసీసీఐ ప్రతినిధులతో నఖ్వీ చర్చలు జరిపినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. నఖ్వీని చూసి భారత మహిళలు దూరంగా ఉండిపోయారు. అతడు స్టేడియం నుంచి వీడి వెళ్లిపోయిన తర్వాతనే భారత మహిళా క్రికెటర్లు ఫోటోలు దిగారు. భారత మహిళా క్రికెటర్లు ట్రోఫీ తీసుకురావడానికి ముందుకు రాకపోవడంతో నఖ్వీ నిరాశతో వెళ్లిపోయాడు.




గతంలో కూడా భారత పురుషుల జట్టు గెలిచినప్పుడు.. పాకిస్తాన్ మీద అద్భుతమైన విజయాన్ని సాధించినప్పుడు.. ట్రోఫీ అందుకోవడానికి ముందుకు రాలేదు. నఖ్వీ అప్పుడు కూడా ఇలాంటి పరాభవాన్నే ఎదుర్కోవాల్సి వచ్చింది. చివరికి ట్రోఫీ ఇవ్వకుండా అతడు వెళ్లిపోయాడు. అయితే ఇప్పటివరకు టీం ఇండియాకు ఆసియా కప్ ట్రోఫీ ఇవ్వలేదని తెలుస్తోంది. దీనికి తోడు ట్రోఫీని భారత జట్టుకు ఇంతవరకు పంపించకపోవడంతో సోషల్ మీడియాలో ఇప్పటికి పాకిస్తాన్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు నఖ్వీ మీద విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి.

సోషల్ మీడియాలో ఈ స్థాయిలో విమర్శలు వ్యక్తం అవుతున్నప్పటికీ.. ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు నఖ్వీ ట్రోఫీ ఇవ్వడానికి ముందుకు రావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని క్రికెట్ విశ్లేషకులు అంటున్నారు. అసలు పాకిస్తాన్ అంటేనే టీమిండియా ఈ స్థాయిలో చీదరించుకుంటుంటే.. సిగ్గు లేకుండా ట్రోఫీ ఇవ్వడానికి పాకిస్తాన్ క్రికెట్ సంఘ అధ్యక్షుడు ముందుకు ఎలా వస్తారని క్రికెట్ విశ్లేషకులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పాకిస్తాన్ క్రికెట్ పెద్దలు.. పాకిస్తాన్ దేశ అధినేతలు సిగ్గు తెచ్చుకోవాలని.. భారత్ మీద విద్వేషాన్ని మానుకోవాలని విశ్లేషకులు చెబుతున్నారు.

# స్మృతి ఫిట్‌నెస్ సీక్రెట్..

భారతీయ మహిళా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. మైదానంలో తన అద్భుతమైన బ్యాటింగ్‌తో ప్రత్యర్థులను వణికించే ఈమె తన అద్భుతమైన ఫిట్‌నెస్‌తోనూ కుర్రకారు హృదయాలను కొల్లగొడుతున్నారు. కేవలం 30 ఏళ్ల వయసులోనే ఆమె తన శరీరాన్ని ఎంతో ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉంచుకుంటున్నారు.దీని వెనుక కఠినమైన డైట్లు, భారీ కసరత్తులున్నాయి? మాంసాహారం ముట్టకుండా ఆమె ఫిట్ గురించి చూద్దాం.

**రకరకాల వర్కవుట్లతో చెమటోడ్చే స్మృతి**

శరీర సామర్థ్యాన్ని పెంచుకోవాలంటే ఒకే రకమైన వ్యాయామానికి పరిమితం కాకూడదని స్మృతి నమ్ముతారు. ఆమె వారానికి 6 రోజులు క్రమం తప్పకుండా వర్కవుట్లు చేస్తారు. కాళ్ల బలాన్ని పెంచుకోవడానికి ప్రతిరోజూ క్రమం తప్పకుండా రన్నింగ్ చేస్తారు. అంతేకాకుండా స్క్వాట్స్, డెడ్‌లిఫ్ట్స్, పుల్–అప్స్ వంటి కఠినమైన వ్యాయామాలు చేస్తూ కండరాలను బలంగా ఉంచుకుంటారు. ఒకవేళ ఉదయం సమయం కుదరకపోతే, సాయంత్రం వేళల్లో జిమ్‌కి వెళ్లి మరీ తన వర్కవుట్‌ను పూర్తి చేస్తారు. క్రమశిక్షణే ఆమె విజయానికి అసలు రహస్యం.

**శాఖాహారమే ఆమె బలం**

చాలా మంది సెలబ్రిటీలు, క్రికెటర్లు ప్రోటీన్ కోసం చికెన్, మటన్, చేపలు తింటుంటారు. కానీ స్మృతి మంధాన మాత్రం వీటికి పూర్తి దూరం. ఆమె పూర్తిగా ఇంట్లో తయారుచేసిన సాధారణ శాఖాహారాన్ని మాత్రమే ఇష్టపడతారు. ప్రధానం గా లాక్టో–ఓవో–వెజిటేరియన్ డైట్‌ను పాటిస్తారు. ఇందులో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, పాల ఉత్పత్తులు, గుడ్లు ఉంటాయి. శరీరానికి కావలసిన ప్రోటీన్ అందడానికి ఆమె గుడ్లు, ప్రోటీన్ షేక్స్ తీసుకుంటారు. శరీరాన్ని ఎప్పు దూ హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడానికి నీరు, కొబ్బరి నీళ్లు తాగుతుంటారు.

**చీట్ డే రోజు ఇష్టమైన ఫుడ్స్ ఇవే**

స్మృతి మంధానాకు రాజస్థానీ మార్వాడీ వంటకాలు, స్ట్రీట్ ఫుడ్ లో భేల్‌పూరి అంటే ఎంతో ఇష్టం. చీట్ డే రోజుల్లో ఆమె ఇష్టంగా భేల్ పూరి తింటారు. అయితే స్వీట్ల జోలికి మాత్రం అస్సలు వెళ్లరు. ఒకవేళ తీపి తినాలనిపిస్తే మాత్రం ఆరోగ్యకరమైన డార్క్ చాక్లెట్‌ను తిని సరిపెట్టుకుంటారు. సరైన నిద్ర, క్రమశిక్షణతో కూడిన ఆహారపు అలవాట్లే తన ఫిట్‌నెస్‌కు అసలైన కారణమని ఆమె చెబుతున్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 16.09.2026
www.mudranews.in | @mudranews
5
జనరల్ న్యూస్
GENERAL NEWS

**జలుబు రాకుండా**

తగినంత నీరు తాగండి. రోజంతా శరీరానికి అవసరమైనంత నీరు తీసుకోవాలి. నీరు తాగడం వల్ల శరీరం హైడ్రేట్‌గా ఉండటంతో పాటు గొంతు, ముక్కు వంటి శ్వాసకోశ భాగాలు సౌకర్యంగా ఉండేందుకు సహాయపడుతుంది.



# షూటింగ్‌లో తెలంగాణ పోలీసుల జోరు

**విజేతలను అభినందించిన డిజిపి సి.వి. ఆనంద్**

**రాష్ట్ర, సౌత్‌జోన్ పోటీల్లో 15 పతకాలు**

**6 స్వర్ణాలు 4 రజతాలు 5 కాంస్యాలు**



**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబరు 15:** షూటింగ్ క్రీడల్లో తెలంగాణ పోలీసు సిబ్బంది సత్తా చాటారు. రాష్ట్ర, సౌత్‌జోన్ స్థాయి పోటీల్లో కలిపి 6 స్వర్ణాలు, 4 రజతాలు, 5 కాంస్యాలతో మొత్తం 15 పతకాలు సాధించారు. మంగళ వారం డిజిపి కార్యాలయంలో విజేతలను డిజిపి సి.వి. ఆనంద్ అభినందించారు. క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ శాఖకు పేరు తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. రాబోయే జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో 11 పతకాలు XII వ తెలంగాణ రాష్ట్ర షూటింగ్ ఛాంపియన్‌షిప్–2026 జూన్ 20 నుంచి 28 వరకు హైదరాబాద్ గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ, సాట్‌జీ షూటింగ్ రేంజ్‌లో జరిగింది. రైఫిల్, పిస్టల్ విభాగాల్లో తెలంగాణ పోలీసు షూటర్లు 4 స్వర్ణాలు, 3 రజతాలు, 4 కాంస్యాలు సాధించారు.13వ బెటాలియన్ టీజీఎస్పీకి చెందిన పీసీ 1304 జి. నిరంజన్‌రెడ్డి 50 మీటర్ల పిస్టల్‌లో స్వర్ణం, 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో రజతాలు సాధించారు. డిజి టెక్నికల్ సర్వీసెస్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ ఎ. ప్రసన్నకుమార్ 50 మీటర్ల పిస్టల్ మాస్టర్ విభాగంలో స్వర్ణం, 25 మీటర్ల సెంటర్ ఫైర్ పిస్టల్‌లో కాంస్యం సాధించారు. ఫ్యూచర్‌సిటీ లో పని చేస్తున్న ఇన్‌స్పెక్టర్ బి. జేమ్స్‌బాబు రజతం, కాంస్య పతకాలు సాధించారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న వాసీ వి. సువర్ణ 50 మీటర్ల రైఫిల్ ప్రోన్‌లో స్వర్ణం దక్కించుకున్నారు. సీఎస్‌డబ్ల్యూ హైదరాబాద్ సీఐ బి. శంకర్ 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ మాస్టర్ విభాగంలో స్వర్ణం సాధించారు. సౌత్‌జోన్‌లో 4 పతకాలు 17వ సౌత్‌జోన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్–2026 ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 8 వరకు కేరళలోని తిరువనంతపురంలో నిర్వహించారు. తెలంగాణ పోలీసు షూటర్లు 2 స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం సాధించారు.3వ బెటాలియన్ టీజీఎస్పీకి చెందిన జి. నిరంజన్‌రెడ్డి 50 మీటర్ల ఫ్రీ పిస్టల్, 25 మీటర్ల సెంటర్ ఫైర్ పిస్టల్‌లో రెండు స్వర్ణాలు, 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్‌లో రజతం సాధించారు. ఫ్యూచర్‌సిటీ ఐటీ సెల్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ బి. జేమ్స్‌బాబు కాంస్య పతకం సాధించారు.పతకాలు సాధించిన తెలంగాణ పోలీసు క్రీడాకారులను ఐజీ (పి & ఎల్) గజరావు భూపాల్, స్పోర్ట్స్ డీఎస్పీ రామారావుతో పాటు పలువురు పోలీసు అధికారులు అభినందించారు.

# సమస్యల పరిష్కారమే సీఎం ప్రజావాణి ధ్యేయం

**రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్, సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి**



**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్రం నలుమూలల నుంచి వస్తున్న ప్రజల సమస్యల పరిష్కారమే "సీఎం ప్రజావాణి" ధ్యేయమని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్, సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు.మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో నిర్వహించిన 255వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో ఆమె చర్చించారు.ప్రజలు ప్రస్తావించిన సమస్యలను గద్వాల్ విజయలక్ష్మి ఓపికతో విని వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అర్జీలపై ప్రత్యేకంగా నోట్స్ రాసి అధికారులతో ఫోన్లో మాట్లాడి ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆమె కృషి చేశారు.ప్రజావాణికి వెళితే సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకంతో ఉన్న ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా అధికారులు అంకితభావంతో కృషి చేయాలని గద్వాల్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. సీఎం ప్రజావాణిలో ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, హోం శాఖల అంశాలపై అర్జీలు ఎక్కువగా నమోదు అవుతున్నాయని ఆమె పేర్కొన్నారు. మండలం, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నట్లు గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. కాగా మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు 23, విద్యుత్ శాఖకు 8, బీసీ సంక్షేమ శాఖకు 7, ఇతర శాఖలకు 36 కలిపి మొత్తం 74 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏసిపి ఉమేందర్, ప్రవాసి ప్రజావాణి నుంచి మంద భీమ్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జేఎన్టీయూలో ఘనంగా 'ఇంజనీర్స్ డే' వేడుకలు

**ప్రతిభావంతుడైన విద్యార్థికి పరీక్ష ఫీజు అందజేత**



**ముద్ర, కూకట్పల్లి** :జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలో భారత రత్న, ప్రపంచ ప్రసిద్ధ ఇంజనీర్ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా 'ఇంజనీర్స్ డే' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం తరపున సివిల్ ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందిస్తూ, వారి పరీక్షా ఫీజు మొత్తాన్ని విద్యార్థి నాయకులు అందజేశారు. విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంచి, వారిని చదువులో మరింత ప్రోత్సహించడానికే ఈ సహాయం అందించామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు జయరాం, సాగర్ నాయక్ మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య కేవలం గొప్ప ఇంజనీర్ మాత్రమే కాకుండా, నిఖార్సయిన నిజాయితీకి, ఉన్నతమైన వ్యక్తిత్వానికి నిలువుటద్దమని కొనియాడారు. ఆనాడు హైదరాబాద్ నగరం మూసీ నది వరదలతో అతలాకుతలమైనప్పుడు, విశ్వేశ్వరయ్య తన ఇంజనీరింగ్ నైపుణ్యంతోనే గండిపేట, హుస్సేన్ సాగర్ రిజర్వాయర్ల నిర్వహణ విధానాలను రూపొందించి భాగ్యనగరాన్ని రక్షించారని గుర్తుచేశారు. అలాగే కర్ణాటకలోని మైసూరు ప్యాలెస్ వంటి ఎన్నో అత్యద్భుత కట్టడాలను ఆయన రూపుదిద్దారని పేర్కొన్నారు. నేటి సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకుని, దేశ పునర్నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం నాయకులు శ్రీనివాస్, శ్రీనికేతన్, త్రివిక్రమ్, ప్రణయ్ చక్రవర్తి, సోహన్, హేమంత్, సిద్ధార్థ, స్టాలిన్, ఆదిత్య, ఆనంద్, కార్తికేయ, జ్ఞానేశ్వర్, అక్షిత్, రోనిత్ పాల్గొన్నారు.

## 17ను తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి





**రౌండ్ టేబుల్ సమావేశంలో డిమాండ్**

**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబర్ 15:** తెలంగాణ విమోచన దినోత్సవమైన సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని పలువురు ప్రముఖులు డిమాండ్ చేశారు. అలయ్ బలాయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బండారు విజయలక్ష్మి నేతృత్వంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.సమావేశంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్. విద్యాసాగర్‌రావు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ కోదండరామ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజని బండారు దత్తాత్రేయ అన్నారు. నిజాం పాలనలో ప్రజలు ఎదుర్కొన్న అణచివేత, రజాకార్ల దమనకాండను ఆయన ప్రస్తావించారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ నాయకత్వంలో జరిగిన సైనిక చర్య అనంతరం నిజాం పాలనకు ముగింపు పలికి తెలంగాణ భారత సమాఖ్యలో విలీనమైందని పేర్కొన్నారు. విమోచన పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమర వీరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు.తెలంగాణ విమోచన చరిత్రను రాజకీయాలకు అతీతంగా చూడాలని మాజీ గవర్నర్ సీహెచ్. విద్యాసాగర్‌రావు అన్నారు. రజాకార్ల దమనకాండకు బైరాన్‌పల్లి విషాద సాక్ష్యంగా నిలిచిందని గుర్తుచేశారు. చారిత్రక ఆధారాలను సేకరించి పరిశోధనలు ప్రోత్సహించాలని సూచించారు.కర్ణాటక, మహారాష్ట్రల్లో తమ ప్రాంతాల విలీనానికి సంబంధించిన చారిత్రక సందర్భాలను అధికారికంగా నిర్వహిస్తున్న విధంగానే తెలంగాణలోనూ సెప్టెంబర్ 17ను ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించాలని వక్తలు ఏకగ్రీవంగా కోరారు. యువతకు చరిత్రను చేరువ చేసేందుకు పాఠ్యాంశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

# ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్

**20 మందికి పైగా గాయాలు**

**ముద్ర, హైదరాబాద్:** హయత్‌నగర్ సమీపంలోని కుంట్లూరు రాజీవ్ గృహకల్ప వద్ద ఆర్టీసీ బస్సును టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో 20 మందికి పైగా ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. రాజీవ్ గృహకల్ప నుంచి ప్రయాణికులను ఎక్కించుకుని వస్తున్న హయత్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మెయిన్ రోడ్డును దాటుతున్న సమయంలో నాగోల్ వైపు నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ లారీ బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సులోని పలువురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి.సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ దరఖాస్తుల గడువు పొడిగింపు

**సెప్టెంబర్ 20 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబర్ 15:** ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకం కింద నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇళ్ల కోసం దరఖాస్తుల స్వీకరణ గడువును సెప్టెంబర్ 20, 2026 వరకు పొడిగించినట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌసింగ్ కమిషనర్ వి.పి. గౌతమ్ తెలిపారు.వరుస సెలవులు, పండుగల నేపథ్యంలో గడువు పొడిగించాలని ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.ప్రస్తుతం చాంద్రాయణగుట్ట, ఎల్‌బీ నగర్, ముషీరాబాద్, గోషామహల్ నియోజకవర్గాల పరిధిలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌లోని ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గతంలో 16 నియోజకవర్గాల నుంచి దరఖాస్తులు స్వీకరించి, లాటరీ ద్వారా ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.సంబంధిత నాలుగు నియోజకవర్గాల ప్రజలు పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకుని సెప్టెంబర్ 20లోగా దరఖాస్తులు సమర్పించాలని గౌతమ్ సూచించారు. పథకానికి సంబంధించిన అర్హతలు, ఇతర నిబంధనల్లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు.మరిన్ని వివరాలకు తెలంగాణ హౌసింగ్ బోర్డు వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. హెల్ప్‌లైన్ కోసం 040–24603572ను సంప్రదించాలని సూచించారు.

## నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలి

**కూకట్ పల్లి డీసీపీ రితిరాజ్**



**ముద్ర, శేరిలింగంపల్లి :** మాదాపూర్ దుర్గం చెరువులో గణేశ్ విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను కూకట్ పల్లి డీసీపీ రితిరాజ్ పరిశీలించారు. సీఎంసీ డీసీ బాలక్రిష్ణ, ట్రాఫిక్ అడిషన్ డీసీపీ, మాదాపూర్ ఏసీపీలు, ఎస్‌హెచ్ వోతో కలిసి దుర్గం చెరువు పరిసరాలను డీసీపీ రితిరాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా నిమజ్జనం ప్రశాంతంగా జరిగేట్టు చర్యలు తీసుకోవాలని, వాహన రాకపోకలకు అంతరాయం కలగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్లాన్ చేసుకోవాలని సూచించారు. విగ్రహాలను చెరువులోకి దింపేందుకు క్రేన్ల ఏర్పాటు, చెరువు పరిసరాల్లో బారికేడ్లు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపు తో కంట్రోల్ రూంను ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయాలపై తగిన సూచనలు చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనం రోజు సాధారణ ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని డీసీపీ రితిరాజ్ అధికారులకు సూచించారు.

## పంతాలకు పోయి పదోన్నతులు కోల్పోవద్దు

**ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా డిజిపి సి.వి. ఆనంద్**



**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబర్ 15:** పంతాలకు పోయి పదోన్నతులు కోల్పోవద్దని 1991, 1995, 1996 బ్యాచ్‌ల డీఎస్పీలకు డిజిపి సి.వి. ఆనంద్ సూచించారు. పదోన్నతుల విషయంలో నెలకొన్న సమస్యను పరిష్కరించేందుకు తాను చొరవ తీసుకుంటానని, ముందుండి అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.రాష్ట్రవ్యాప్తంగా ఆయా బ్యాచ్‌లకు చెందిన డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా 37 మందికి పదోన్నతులు రావాల్సి ఉంది. అయితే కొందరు అధికారులు కోర్టులను ఆశ్రయించడంతో పదోన్నతుల ప్రక్రియ కొంతకాలంగా పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో డిజిపి చొరవ తీసుకుని డిజిపి కార్యాలయంలో శుక్రవారం ఆయా బ్యాచ్‌ల అధికారులతో సమావేశమయ్యారు. కేసుల విషయంలో నిర్ణయం తీసుకునేందుకు వారం రోజుల సమయం ఇచ్చారు.కోర్టు కేసుల కారణంగా పదోన్నతుల ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతోందని డిజిపి వివరించారు. "కేసులు వేసుకుని నష్టపోవద్దు. మీ సమస్య పరిష్కారానికి నేను ముందుంటా. అందరూ సహకరిస్తే త్వరగా పదోన్నతులు కల్పించవచ్చు" అని సూచించారు. ప్రస్తుతం ఉన్న 37 అదనపు ఎస్పీ ఖాళీల కు వెంటనే పదోన్నతులు కల్పిస్తామన్నారు. కేసుల ఉపసంహరణకు ముందుకు.. డిజిపితో సమావేశం అనంతరం వరంగల్ జోన్‌కు చెందిన 1991, 1995, 1996 బ్యాచ్‌ల అధికారులు కోర్టులో దాఖలు చేసిన కేసులను ఉపసంహరించుకుంటున్నట్లు డిజిపికి లేఖ అందించారు. హైదరాబాద్ సిటీకి చెందిన 1991, 1995,1996 బ్యాచ్‌ల అధికారులు కూడా కేసుల ఉపసంహరణకు సుముఖత వ్యక్తం చేశారు. దీంతో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డీఎస్పీల నుండి అదనపు ఎస్పీలుగా పదోన్నతుల అంశం కొలిక్కి వచ్చే అవకాశం ఏర్పడింది. డిజిపి సి.వి. ఆనంద్ చొరవతో సమస్య పరిష్కారం దిశగా కదలిక రావడంపై అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

## ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్ సీట్ల కేటాయింపు

**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబర్ 15:** 2026–27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ అడ్మిషన్ల కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్ సీట్ల కేటాయింపును కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం మంగళవారం విడుదల చేసింది. కాలేజీల వారీగా సీట్ల కేటాయింపు వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. సెకండ్ ఫేజ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 19 సాయంత్రం 4 గంటల్లోపు సంబంధిత కాలేజీల్లో చేరాలని యూనివర్సిటీ సూచించింది. అడ్మిషన్ సమయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు, బాండ్లు, ఇతర అవసరమైన పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.అలాగే మేనేజ్‌మెంట్ కోటా ఎంబీబీఎస్ / బీడీఎస్ ఫస్ట్ ఫేజ్ సీట్ల కేటాయింపులు కూడా విడుదలయ్యాయి. ఈ కేటగిరీలో సీట్లు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 19 సాయంత్రం 6 గంటల్లోపు సంబంధిత కాలేజీల్లో చేరాలి.మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ షెడ్యూల్ ప్రకారం 2026–27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ అకడమిక్ సెషన్ సెప్టెంబర్ 15 నుంచి ప్రారంభమైందని యూనివర్సిటీ తెలిపింది. విద్యార్థులు నిర్ణీత గడువులో అడ్మిషన్లు పూర్తి చేసుకోవాలని సూచించింది.

## మోదీ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు



**ముద్ర, హైదరాబాద్ :** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు.గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మోదీ సేవా స్ఫూర్తితో బీజేపీ కార్యకర్తలే కాకుండా ప్రజలందరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి, ప్రధాని మోదీ ఆయురారోగ్యాలతో మరిన్ని సంవత్సరాలు దేశ సేవ కొనసాగించాలని ఆకాంక్షించాలని కోరారు.పాఠశాలలు, కళాశాలల్లో చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దాదాపు 25 లక్షల మంది విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని మోదీ త్యాగం, సేవా స్ఫూర్తి, వికసిత్ భారత్ నిర్మాణం వంటి అంశాలపై తమ ఆలోచనలు పంచుకోనున్నారని చెప్పారు.'నమో సేవా యాత్ర'తో పాటు నెల రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించి ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను ఘనంగా జరుపుకోవాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. మోదీ సేవా స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు.

## ఉద్యమకారుల ఎఫ్ఐఆర్ రికార్డుల డేటా అందించాలి

**తెలంగాణ ప్రభుత్వ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ డీజీపీకి వినతి**



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, స్వరాష్ట్ర సాధన కోసం జరిగిన వివిధ దశల పోరాటాల్లో అక్రమ కేసులు, అరెస్టులు, జైలు శిక్షలు ఎదుర్కొన్న ఉద్యమకారుల వివరాలను సమగ్రంగా సేకరించే ప్రక్రియలో భాగంగా తెలంగాణ ప్రభుత్వ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు శ్రీ మోతె శోభన్ రెడ్డి మరియు మాజీ ఎమ్మెల్సీ శ్రీ రాములు నాయక్ రాష్ట్ర డీజీపీ శ్రీ సి.వి. ఆనంద్, ఐపీఎస్‌ను డీజీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వరాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో ఉద్యమకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లు, కేసుల వివరాలు, అరెస్టులు, రిమాండ్, జైలు శిక్షలకు సంబంధించిన పోలీసు రికార్డులు, అందుబాటులో ఉన్న డేటాను కమిటీకి అందజేయాలని వారు డీజీపీని కోరారు. ఉద్యమంలో పాల్గొన్న నిజమైన ఉద్యమకారులను గుర్తించేందుకు పోలీసు శాఖ వద్ద ఉన్న అధికారిక రికార్డులు ఎంతో కీలకమని వారు వివరించారు.ఉద్యమకారుల త్యాగాలు, పోరాటాలను గుర్తించి వారికి తగిన గౌరవం, గుర్తింపు కల్పించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ప్రక్రియలో భాగంగా సంబంధిత రికార్డుల సేకరణ అవసరమని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ సి.వి. ఆనంద్ స్పందిస్తూ, ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియకు పోలీసు శాఖ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేసినట్లు తెలిపారు. సంబంధిత రికార్డుల సేకరణకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు అధికారులకు సూచనలు చేస్తామని డీజీపీ హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల చరిత్ర, వారి త్యాగాలు అధికారిక రికార్డుల్లో ప్రతిబింబించేలా చర్యలు తీసుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు ఉద్యమ చరిత్రను సజీవంగా అందించవచ్చని పలువురు అభిప్రాయపడ్డారు.

## వినాయక శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదు

**ముద్ర ప్రతినిధి, తాండూర్:** వినాయక శోభాయాత్ర (నిమజ్జనం) సమయంలో డిజె సౌండ్ సిస్టమ్స్ కు ఎలాంటి అనుమతి లేదని పెద్దేముల్ ఎస్సై ప్రశాంత్ వర్ధన్ స్పష్టం చేశారు. వినాయక నిమజ్జన వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలనే ఉద్దేశంతో పెద్దేముల్ మండలంలోని 14 మంది డీజే ఆపరేటర్లను మండల తహసీల్దార్ శ్రీ వెంకటేష్ ప్రసాద్ గారి ఎదుట హాజరుపరచినట్లు ఎస్సై తెలిపారు. ప్రతి డీజే ఆపరేటర్‌ను రూ.2 లక్షల పూచీకత్తుతో వ్యక్తిగత బాండ్‌పై బైండోవర్ చేయడం జరిగిందని పెద్దేముల్ ఎస్సై ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.

## జలుబు ఉన్నవారికి దగ్గరగా ఉండటాన్ని తగ్గించండి

జలుబు లేదా ఇతర శ్వాసకోశ ఇన్ఫెక్షన్ ఉన్నవారితో చాలా దగ్గరగా ఉండకుండా జాగ్రత్త పడాలి. రద్దీ ప్రదేశాల్లో అవసరమైనప్పుడు మాస్క్ ధరించడం, గదుల్లో మంచి గాలి ప్రసరణ ఉండేలా చూడడం కూడా ఉపయోగకరం.



## రేవంత్ మాట తప్పడం ట్రేడ్‌మార్క్: కవిత

**ముద్ర, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట తప్పడం, మడమ తిప్పడం ట్రేడ్ మార్క్ గా మారిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై టీఆర్ఎస్ నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రభుత్వానికి బానిసలు కాదని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 18లోగా ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ఉద్యోగ సంఘాలు హైదరాబాద్ దిగ్బంధానికి పిలుపునివ్వాలని సూచించారు. వారి పోరాటానికి టీఆర్ఎస్ అన్ని విధాలా మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు. ఉద్యోగులకు 51 శాతం ఫిట్ మెంట్ తో పీఆర్సీ అమలు చేయాలని, 32 నెలలుగా పెండింగ్ లో ఉన్న డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2003లో నియమితులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఓపీఎస్ వర్తింపజేయాలని, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని కవిత డిమాండ్ చేశారు.

## విమోచన దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పరిశీలన



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న వేడుకల ఏర్పాట్లను కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో కలిసి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ స్టేట్‌కు విముక్తి లభించిందని, కర్ణాటక, మహారాష్ట్రల్లో ఈ వేడుకలను నిర్వహిస్తున్నప్పటికీ తెలంగాణలో మాత్రం అధికారికంగా నిర్వహించలేదని అన్నారు. రాజకీయాలు, ఓట్ల కోసం గత ప్రభుత్వాలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని పణంగా పెట్టాయని విమర్శించారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని బీజేపీ అనేక ఉద్యమాలు చేసిందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తోందని చెప్పారు. ఈ వేడుకలను ఘనంగా నిర్వహించడంతో పాటు తెలంగాణ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఈటల రాజేందర్ కోరారు.

## ప్రజల కోసం ప్రాణాలర్పించింది కమ్యూనిస్టులే




**ముద్ర చిగురుమామిడి, :** తెలంగాణ విముక్తి కోసం కమ్యూనిస్టులు చేసిన త్యాగాలను వక్రీకరిస్తే సీపీఐ చూస్తూ ఊరుకోదని సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి, గునుకులపల్లి, ఓగులాపూర్, గాగిరెడ్డిపల్లి, నవాబుపేట, చిగురుమామిడి, రేకొండ, బొమ్మనపల్లి గ్రామాల్లోని అమరవీరుల స్మారక స్థూపాల వద్ద సీపీఐ నేతలు నివాళులర్పించారు. పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ వెట్టి చాకిరీ, బానిసత్వం, అణచివేతకు వ్యతిరేకంగా, భూమి కోసం భుక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సాగిందన్నారు. బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మక్దూం మొయిద్దీన్ పిలుపుతో వేలాది గ్రామాల నుంచి ప్రజలు పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి వంటి నాయకులు ప్రజలను చైతన్యపరిచి నిజాం, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడారని పేర్కొన్నారు. ఈ పోరాటంలో 3 వేల గ్రామాలు విముక్తి పొందగా, 4,500 మంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగం చేశారని, 10 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పంచిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. సెప్టెంబర్ 17, 1948న హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమైందని తెలిపారు. ఇందుర్తి ప్రాంతంలో ప్రజల కోసం కమ్యూనిస్టు నాయకులే పోరాడారని చాడ వెంకటరెడ్డి అన్నారు. రంగారెడ్డి దొర దోపిడీకి వ్యతిరేకంగా ముస్కురాజిరెడ్డి, గునుకుల జనార్దన్‌రెడ్డి, కూన ముత్తయ్య తదితరులు పోరాడి అప్పు పత్రాలను తగలబెట్టారని గుర్తుచేశారు.సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో బద్దం ఎల్లారెడ్డి, అనభేరి ప్రభాకర్‌రావు వంటి నేతలు సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఇందుర్తి కమ్యూనిస్టు పోరాటాలకు కంచుకోటగా నిలిచిందని, అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి,మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, కొయ్యడ సృజన్ కుమార్,న్యాలపట్ల రాజు, ఇప్టా జాతీయ కౌన్సిల్ సభ్యులు కవ్వంపెల్లి స్వామి,జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్ రెడ్డి,అందె చిన్న స్వామి,కాంతాల శ్రీనివాస్ రెడ్డి, బోయిని పటేల్,తేరాల సత్యనారాయణ ల,ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు కన్నం లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి వరుకోలు సదానందం,దుడ్డేల సమ్మయ్య, ఎజ్జ రాజయ్య,సిపిఐ మండల సహాయ కార్యదర్శులు బూడిద సదాశివ,పైడిపెల్లి వెంకటేష్, సీనియర్ నాయకులు ముద్రకోల రాజయ్య,మాజీ సర్పంచ్ గోలి బాపురెడ్డి,వివిధ గ్రామాల శాఖ కార్యదర్శులు మహమ్మద్ ఉస్మాన్ పాషా,మంద ఎల్లయ్య,ఎలగందుల రాజు,చెప్యాల శ్రీనివాస్,అనువోజు జనార్ధన్,ఇల్లందుల రాజయ్య,కయ్యం తిరుపతి,నీల వెంకన్న,అందె సంపత్ అమరవీరుల కుటుంబాల వారసులు ముస్కు శ్రీనివాస్ రెడ్డి, అంజిరెడ్డి,కూన భాస్కర్,పెద్దన్న,వేముల కృష్ణ,రాము,గునుకుల సురేందర్ రెడ్డి,చింతపూల రాములు,నరేందర్,సింగిరెడ్డి శంభు రెడ్డి,రాజేశ్వర్ రెడ్డి,గుర్రం మురళి తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు

**ముద్ర, ధర్మపురి:** జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ మంగళవారం దర్శించకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు, అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేశారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామివారి చిత్రపటం అందజేసి, శేషవస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ దినేశ్, వేదపండితులు రమేశ్ శర్మ, ఓంకారేశ్వర శర్మ, స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ అల్వాల శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసచార్యులు, స్థానిక సీఐ రాంనర్సింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

# ఆశీర్వాద దీపం వెలిగించండి.. మోదీని దీవించండి

**గుజరాత్ సీఎం, దేశ ప్రధానిగా 25 ఏళ్ల ప్రజా ప్రస్థానంపై బీజేపీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలు**
**సెప్టెంబర్ 17న రక్తదాన శిబిరాలు నిర్వహిస్తాం**
**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి**
**మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానంపై బీజేపీ సేవా కార్యక్రమాలు**




**ముద్ర, కరీంనగర్:** గుజరాత్ సీఎంగా, దేశ ప్రధానిగా ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప్ అభియాన్–జన్ సేవా హీ ప్రభు సేవా' కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. సెప్టెంబర్ 17న సాయంత్రం 7 గంటలకు 'ఆశీర్వాద దీపం' కార్యక్రమం నిర్వహించి మోదీ నిండు నూరేళ్లు ప్రజాసేవలో ఉండాలని ప్రార్థించాలని ఆయన పిలుపునిచ్చారు. అదే రోజు దేశవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 7 వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 'సేవ–అంకితభావం–25 సంవత్సరాలు', 'వికసిత భారత్' అంశాలపై చిత్రలేఖనం, ప్రసంగ పోటీలు నిర్వహిస్తామన్నారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను సన్మానించడం, గ్రామాల్లో కళా ప్రదర్శనలు, రంగోలి కార్యక్రమాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మోదీ పాలనలో లబ్ధిదారుల జీవితాల్లో వచ్చిన మార్పులను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

అక్టోబర్ 7న 'సేవా జ్యోతి కలశ యాత్ర–వికసిత భారత్ సంకల్పం' కార్యక్రమంలో భాగంగా పవిత్ర నదీ జలాలతో వడ్నాగర్‌లోని హటకేశ్వర్ మహాదేవ్ ఆలయం, వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయంలో జలాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. 2047 నాటికి వికసిత భారత్ నిర్మాణంలో ప్రజలను భాగస్వాములను చేయడమే లక్ష్యమన్నారు.

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై విమర్శలు**

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు డ్రామా ఆర్టిస్టుల్లా వ్యవహరిస్తున్నాయని బండి సంజయ్ విమర్శించారు. అవినీతి విషయంలో రెండు పార్టీల తీరు ఒకేలా ఉందని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని, అదే సమయంలో కాంగ్రెస్ అవినీతిపై బీఆర్ఎస్ అసెంబ్లీలో ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. రెండు పార్టీల తీరుతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలనపై పట్టు లేకుండా పోయిందని, ప్రభుత్వాన్ని నడిపేందుకు భూములు అమ్ముకునే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. కర్ణాటక సీఎం డీకే శివకుమార్ కేంద్రాన్ని ఆదుకోవాలని కోరుతున్న వ్యాఖ్యలే కాంగ్రెస్ పాలనా వైఫల్యానికి నిదర్శనమన్నారు. తెలంగాణ కూడా శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్ తరహాలో ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకునే ప్రమాదం ఉందని బండి సంజయ్ హెచ్చరించారు.

## ఇంజనీర్లకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు

**ముద్ర, హైదరాబాద్,** సెప్టెంబర్ 15: జాతీయ ఇంజనీర్స్ డే సందర్భంగా రాష్ట్రంలోని ఇంజనీర్లందరికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అసాధారణ ప్రతిభ, క్రమశిక్షణ, అంకితభావం, దూరదృష్టితో దేశ అభివృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని నేటి ఇంజనీర్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజా సంక్షేమంతో మేళవిస్తూ దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్నారని సీఎం అన్నారు. మౌలిక వసతులు, సాగునీరు, రహదారులు, పరిశ్రమలు, ఆధునిక సాంకేతిక రంగాల అభివృద్ధిలో ఇంజనీర్ల కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

## నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

**ముద్ర, తిరుమల:** కలియుగ వైకుంఠ నాథుడు శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలు నేటి నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు తిరుమల సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. విద్యుత్ దీపాలు, పుష్పాలంకరణలతో శ్రీవారి సన్నిధి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మీనలగ్నంలో ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీసమేతంగా పాల్గొని శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో టీటీడీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పెద్దశేష వాహన సేవ అనంతరం సీఎం తిరుమలలోనే బస చేయనున్నారు. మరుసటి రోజు పిల్‌గ్రిమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, ఎస్వీ మ్యూజియం, ఎలక్ట్రిక్ బస్సులు, నందకం యాప్, భక్తుల గ్రూప్ ఇన్సూరెన్స్ పథకాలను ప్రారంభించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో స్వామివారు వివిధ వాహనాలపై మాడ వీధుల్లో విహరించనుండటంతో స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తిరుమలకు తరలివస్తున్నారు.

## 25కిలోల వెండి వినాయకుడి ఊరేగింపు

**ముద్ర, మెట్ పల్లి :** జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే వినాయక చవితి వేడుకలకు ఓ ప్రత్యేకత ఉంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి నిత్య పూజలు చేస్తుంటారు. మరోవైపు నిత్య పూజల కోసం ప్రత్యేకంగా 25 కిలోల వెండితో వినాయకుడిని తయారు చేయించారు. గణపతితో పాటు మహాలక్ష్మి, సరస్వతి దేవి, శివలింగాలు కూడా వెండితో తయారు చేయించారు. నవరాత్రుల్లో భాగంగా వెండి వినాయకుడిని మేళతాళాల మధ్య మంగళవారం పురవీధుల గుండా ఊరేగించారు.

## కరీంనగర్‌లో 49 వేల మంది విద్యార్థులకు అల్పాహారం




**ముద్ర, కరీంనగర్ :** ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్' కరీంనగర్ జిల్లాలో విస్తరించనుంది. ఇందులో భాగంగా కరీంనగర్ మార్కెట్ యార్డులో సుమారు రూ.8 కోట్లతో నిర్మించిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ సెప్టెంబర్ 16న ప్రారంభించనున్నారు. ఈ కిచెన్ ద్వారా కరీంనగర్, హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల్లోని 17 మండలాల పరిధిలో 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన 49,025 మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించనున్నారు. హరే కృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా కార్యక్రమ అమలు భాగస్వామిగా వ్యవహరించనుంది. ఇడ్లీ–సాంబార్, పూరీ–ఆలూ కుర్మా, దోశ–చట్నీ, ఉప్మా, మిల్లెట్ ఇడ్లీ, బోండా వంటి మెనూను విద్యార్థులకు అందించనున్నారు. రోజు విడిచి రోజు పాలు కూడా ఇవ్వనున్నారు. విద్యార్థుల వయస్సుకు తగిన పోషకాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన మెనూకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (NIN) సహకారం తీసుకున్నారు.

కోడంగల్‌లో 2024 డిసెంబర్‌లో పైలెట్‌గా ప్రారంభించిన ఈ కార్యక్రమంతో విద్యార్థుల హాజరు 75 శాతం నుంచి 90 శాతానికి పెరిగినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఏకాగ్రత, తరగతి గది భాగస్వామ్యం, సమయపాలన మెరుగుపడటంతో పాటు ఆలస్యంగా పాఠశాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య కూడా తగ్గినట్లు తెలిపింది.

రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విస్తరించి 23,106 ప్రభుత్వ పాఠశాలల్లోని సుమారు 17.72 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. 31 జిల్లాల్లో 31 కమ్యూనిటీ కిచెన్లను సుమారు రూ.245 కోట్లతో ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, ఏకాగ్రత, హాజరు పెంపుతో పాటు పేద, మధ్యతరగతి తల్లిదండ్రులకు ఉపశమనం కల్పించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం చెబుతోంది.

## రవీందర్ కుటుంబానికి అండగా ఉంటా

**- మంత్రి పొన్నం ప్రభాకర్**
**- గీకురు రవీందర్ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్పు**
**- కుటుంబ సభ్యులకు మంత్రి భరోసా**



**ముద్ర చిగురుమామిడి:** చిగురుమామిడి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గీకురు రవీందర్ కుటుంబాన్ని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. రవీందర్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేసిన మంత్రి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ రవీందర్ కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడి, వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రవీందర్ మృతి కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా కాంగ్రెస్ పార్టీకి, చిగురుమామిడి ప్రాంత ప్రజలకు తీరని లోటని అన్నారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు అధైర్యపడకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు.రవీందర్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చిగురుమామిడి మండల అధ్యక్షులు అందె సురేష్, సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు మర్కా రాజ్ కుమార్, డీసీసీ కార్యదర్శి సాంబారీ బాబు, మాజీ డీసీసీ అధికార ప్రతినిధి అయిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు వంగర మల్లేశం, సర్పంచులు ఆకవరం భవాని శివప్రసాద్, గోగూరు లక్ష్మి మురహరారెడ్డి, చింతపుల నరేందర్,PACS డైరెక్టర్ లు పోటు మల్లారెడ్డి, బెజ్జంకి భాగ్య, మర్రి శ్రీనివాస్, సీనియర్ నాయకులు గజ్జెల రాములు, పుదరి వేణు, కూనచుల మహేందర్, వంగ కనకయ్య, పూల లచ్చిరెడ్డి, మాజీ ఎంపీటీసీ చీల లక్ష్మారెడ్డి, వడియాల రవీందర్ రెడ్డి, పచ్చిమట్ల జగన్, జిల్లాల భగవాన్ ప్రసాద్,బోయిని వంశీ కృష్ణ,దొబ్బల బాబు, చెల్పూరి విష్ణుమ చారి,గుడిసె అర్జున్, పచ్చిమట్ల అజయ్, సిరవేణి సంపత్, గడ్డం అనిల్, కవ్వంపెల్లి సంజీవ్,దోమ తిరుపతి రెడ్డి,చెరుకు సమ్మయ్య, బాల కృష్ణ చారి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవం ప్రాముఖ్యతను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

**ముద్ర, కరీంనగర్ :** సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవం ప్రాముఖ్యతను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని కోరుతూ కరీంనగర్‌లో భాజపా శ్రేణులు తిరంగా ద్విచక్ర వాహన ర్యాలీని నిర్వహించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు మల్లేశం, అధికార ప్రతినిధి సునీల్ రావు, మేయర్ కొలగాని శ్రీనివాస్ అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్ కేంద్రంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని స్టాచ్యూ ఆఫ్ లిబర్టీగా నిర్మించాలన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 16.09.2026
www.mudranews.in | @mudranews



## జలుబు రాకుండా



పోషకాహారం తీసుకోండి పండ్లు, కూరగాయలు, పప్పులు, ప్రోటీన్ ఉన్న ఆహారం తీసుకోవాలి. సమతుల్య ఆహారం శరీర ఆరోగ్యాన్ని, రోగనిరోధక శక్తిని కాపాడటానికి ఉపయోగపడుతుంది.

## బీబీనగర్ ఠాణా తనిఖీ



**ముద్ర, బీబీనగర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ బీబీనగర్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ పరిసరాలు, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి, రికార్డుల నిర్వహణలో క్రమశిక్షణ, కేసుల దర్యాప్తులో నాణ్యత, పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారం, ప్రజా ఫిర్యాదులపై తక్షణ స్పందన వంటి అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచడంతో పాటు, ప్రజలకు మరింత మెరుగైన పోలీసింగ్ సేవలు అందించేలా ప్రతి అధికారి, సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలని ఆదేశించారు.

## ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

### ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేయాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు ఆదేశించారు. మంగళవారం ఇంచార్జి కలెక్టర్ ఛాంబర్ లో ఖరీఫ్ సీజన్ 2026– 2027 ధాన్యం కొనుగోళ్ల కోసం చేయాల్సిన ఏర్పాట్ల పై వివిధ శాఖల అధికారులతో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు.వ్యవసాయ శాఖ అధికారుల అంచనా మేరకు దాదాపు 3,00,000 లక్షల మెట్రిక్ టన్నుల సన్న, దొలలలడు రకం ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. ఐకేపీ 147 పీఏసీఎస్ 160, యఫ్ పి ఓ 15, మెప్మా 3 ఆద్వర్యంలో మొత్తం 325 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి,డీసీఎస్ఓ రోజారాణి , జిల్లా డీఎం హరికృష్ణ , జిల్లా సహకార శాఖ అధికారి వ్యవసాయ శాఖ అధికారి రమణా రెడ్డి , జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## వ్యభిచార ముఠా నిర్వాహకుడిపై పీడీ యాక్ట్



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 15 :** మహిళలను వ్యభిచారంలోకి దింపి అక్రమంగా ఆర్థిక లాభాలు పొందుతున్న బత్తుల బాలకృష్ణ అనే నిర్వాహకుడిపై పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ముదిగొండ మండలం చిరుమర్రి గ్రామానికి చెందిన బాలకృష్ణ జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ వ్యభిచార గృహాలను నిర్వహిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైందని, నిందితుడిపై ఖమ్మం టూ టౌన్, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లలో అనైతిక రవాణా, వ్యభిచార నిరోధక చట్టం కింద కేసులు నమోదయ్యాయి అని తెలిపారు. 2026 జనవరి 6న ఖమ్మం గాంధీచౌక్‌లోని ఒక లాడ్జిపై దాడి చేసిన పోలీసులు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కాకినాడకు చెందిన మహిళను ఖమ్మం రప్పించి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ కేసులో బాలకృష్ణతో పాటు లాడ్జి మేనేజర్ అలకుంట్ల శ్రీకాంత్ కలిసి కుట్రపూరితంగా వ్యవహరించినట్లు సీపీ వివరించారు. నిందితుడి నేర ప్రవర్తనను అరికట్టేందుకు 1986 పీడీ యాక్ట్ సెక్షన్ 3(2) కింద ఆర్డర్స్ జారీ చేసి, అతడిని హైదరాబాద్‌లోని చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

# కొలువుదీరిన గణనాథుడు

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** వినాయక చవితిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా సోమవారం వినాయక మండపాలలో గణనాథుడు కొలువు ధీరాడు. వివిధ భక్త భజన మండలిలు, యూత్ అసోసియేషన్ ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలలో వివిధ రూపాలలో గణపయ్య ఆసీనుదయ్యాడు. యూత్ సభ్యులు కళారూపాలతో, ఆలయాల గోపురాల ఆకారాలతో సెక్సీలు తయారుచేశారు. చిన్న పెద్ద తేడా లేకుండా గణపయ్య మాలలు వేసి దీక్షలు చేపట్టారు.



**శబరిమల గుడి మాదిరిగా వినాయక మండపం**

భువనగిరి తారకరామ్ నగర్ లో శ్రీ మణికంఠ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణనాధుడు శ్రీ ధర్మశాస్త అయ్యప్ప స్వామి రూపములో భక్తులకు దర్శనం ఇస్తున్నాడు. అలాగే అయ్యప్ప స్వామి చరిత్రను స్పష్టంగా అర్థమయ్యే విధంగా వివిధ విగ్రహాలను తయారు చేశారు శబరిమల గుడి తరహాలో పందిరి వేసి ఆకట్టుకున్నారు.



**స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో**

స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఉపాలయమైన శ్రీ విష్ణు మహా గణపతి కి నవకలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు. లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు. సాయంత్రం సకల కార్య సిద్ధి కొరకు గణపతి హోమం నిర్వహించారు.

**తొలి రోజు అన్నదానం**

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భువనగిరి గంజ్ లో భజరంగ్ వ్యాయామశాల మండపం వద్ద తొలి రోజు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అన్నప్రసాదాలను స్వీకరించారు. అన్నదాన కార్యక్రమాన్ని తుగిటి భాస్కర్, శివం జువెలర్స్ వారి సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భజరంగ్ వ్యాయామశాల సభ్యులు గొరింకల శివశంకర్, సరగడ కరుణ్, సరగడ అమర్, ముత్యాల సాయికిరణ్ యాదవ్, ముత్యాల లక్ష్మీనారాయణ, కే. వెంకటేష్, ఎల్లారెడ్డి, దత్తు యాదవ్, సరగడ రాము, సరగడ శ్రీనివాస్ పాల్గొన్నారు.



# పరిశ్రమలు–యువత అనుసంధానమే పరిష్కారం

### సెప్టెంబర్ 19న కోదాడలో మెగా జాబ్‌మేళా 3,500 మందికి పైగా ఉద్యోగావకాశాలు




**ముద్ర, సూర్యాపేట, సెప్టెంబర్ 15:** గ్రామీణ ప్రాంతాల విద్యావంతులైన నిరుద్యోగ యువతను ప్రముఖ పారిశ్రామిక సంస్థలతో అనుసంధానించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 19న కోదాడలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.జాబ్‌మేళాకు సుమారు 300 కంపెనీలను ఆహ్వానించామని, 3,500 మందికి పైగా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. అభ్యర్థుల అర్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఒక్కొక్కరికి ఐదు సంస్థల్లో ఇంటర్వ్యూ చేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు.హైదరాబాద్‌కు వెళ్లి ఉద్యోగాల కోసం ప్రయత్నించడం గ్రామీణ యువతకు ఆర్థికంగా, సామాజికంగా భారంగా మారుతోందని, అందుకే ప్రముఖ కంపెనీలనే గ్రామీణ యువత ముందుకు తీసుకురావడమే జాబ్‌మేళా లక్ష్యమన్నారు.అపోలో గ్రూప్, జీఎంఆర్, రాంకీ, మహీంద్రా అండ్ మహీంద్రాతో పాటు సిమెంట్, తయారీ, ఐటీ, ఫార్మా, నిర్మాణ, సేవా రంగాలకు చెందిన సంస్థలను జాబ్‌మేళాలో భాగస్వామ్యం చేస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు సాధ్యమైనంత వరకు జాబ్‌మేళా ప్రాంగణంలోనే ఆఫర్ లెటర్లు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై ఆఫర్ లెటర్లు అందజేస్తారని చెప్పారు.ఇప్పటికే సుమారు 1.5 లక్షల మంది ఉద్యోగార్థులకు బల్క్ సందేశాలు పంపినట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థులు క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామస్థాయిలో నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా సమాచారం చేరవేయాలని మంత్రి కోరారు.జాబ్‌మేళా ద్వారా గ్రామీణ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు విద్యాసంస్థలు, పరిశ్రమలు, యువత మధ్య శాశ్వత అనుసంధానానికి ఇది ఆదర్శంగా నిలవాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆకాంక్షించారు.

# మతోన్మాదుల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టండి

### సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి. జహంగీర్



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని హిందూ ముస్లిం కొట్లాటగా బిజెపి, ఆర్ఎస్ఎస్ మతోన్మాదులు ప్రచారం చేస్తున్నారని, చరిత్రను వక్రీకరిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ విమర్శించారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి స్ఫూర్తితో మతోన్మాదల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. మంగళవారం భువనగిరి పట్టణంలోని తిరందాసు గోపి గ్రంథాలయంలో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీపీఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యులు కామ్రేడ్ సీతారాం ఏచూరి 2వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం "తెలంగాణ విలీనం, వాస్తవాలు – వక్రీకరణలు " అనే అంశంపై " సెమినార్ " రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ అధ్యక్షతన జరగగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జహంగీర్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని హిందూ–ముస్లింల మధ్య ఘర్షణగా చిత్రీకరించడం చారిత్రక వాస్తవాలను వక్రీకరించడమేనని అన్నారు. నిజాం నిరంకుశ పాలనతో పాటు భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా సాగిన ప్రజా పోరాటాన్ని మత పరమైన కోణంలోకి నెట్టడం ద్వారా బీజేపీ–ఆర్ఎస్ఎస్ ప్రజలను విభజించేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. చరిత్రను మతోన్మాద రాజకీయాలకు ఉపయోగించుకోవాలనే బీజేపీ ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, సామాజికవేత్త బట్టు రామచంద్రయ్య, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వెంకటేష్ , డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కవిడే సురేష్ , బుర్రు అనిల్ కుమార్, సీపీఎం భువనగిరి మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య , రోజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి వడ్డెబోయిన వెంకటేష్, సీపీఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు గంధమల్ల మాతయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యురాలు కొండమడుగు నాగమణి, మండల పట్టణ కమిటీ సభ్యులు కొండపురం యాదగిరి, మధ్యపురం బాల్ నర్సింహ, మోటె ఎల్లయ్య, వల్దాస్ అంజయ్య పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి

### జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** సెప్టెంబర్ 17న నిర్వహించనున్న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించనున్న ప్రజా పాలన దినోత్సవ వేడుకలకు అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు.కలెక్టరేట్ ప్రాంగణంలో కార్యక్రమానికి అనుగుణంగా వేదికను ఏర్పాటు చేయడంతో పాటు, వీఐపీలు, అధికారులు, ఇతర అతిథులకు అనుకూలంగా సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమ వివరాలతో కూడిన ఆహ్వానాలను ముఖ్య అతిథితో పాటు ప్రోటోకాల్ ప్రకారం సంబంధిత ప్రజాప్రతినిధులకు అందజేయాలని సూచించారు.వేదికను పూలతో అందంగా అలంకరించాలని, కార్యక్రమంలో విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. వేడుకలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పని చేయాలని ఇంచార్జి కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి అంజిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వినాయక మాలతో వచ్చిన విద్యార్థులకు కాలేజీ గేట్లు బంద్




**చివరకు దిగొచ్చిన యాజమాన్యం**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 15 :** భక్తి భావాలు, ఆచారాలు, ఆపై నాటకీయ పరిణామాలతో ఖమ్మం నగరంలోని హార్వెస్ట్ జూనియర్ కళాశాల ప్రాంగణం ఒక్కసారిగా అట్టుడికిపోయింది. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎంతో నిష్ఠతో వినాయక మాల ధరించి కళాశాలకు వచ్చిన ఆరుగురు ఇంటర్మీడియట్ విద్యార్థులకు యాజమాన్యం ఊహించని షాక్ ఇచ్చింది. కాలేజీ నిబంధనల పేరుతో మాలతో వచ్చిన విద్యార్థులను లోపలికి అనుమతించే ప్రసక్తే లేదంటూ గేట్లు మూసివేశారు. మాల తొలగించుకుని సాధారణ దుస్తుల్లో వస్తేనే ఎంట్రీ ఇస్తామని యాజమాన్యం తేల్చిచెప్పడంతో ఆ విద్యార్థులు దిక్కుతోచని స్థితిలో ఇళ్లకు వెనుదిరగాల్సి వచ్చింది. ఈ విషయం కాస్తా విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు బీజేపీ, ఏబీవీపీ నాయకులకు తెలియడంతో పెద్దఎత్తున కళాశాల వద్దకు చేరుకున్నారు. హైందవ సంప్రదాయాలను, విద్యార్థుల మనోభావాలను కాలేజీ యాజమాన్యం అవమానిస్తోందంటూ వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల గేట్ల ఎదుట బైఠాయించి యాజమాన్య తీరుకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. దీంతో కాలేజీ సిబ్బందికి, ఆందోళనకారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం నడవడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.పరిస్థితి చేయి దాటి పెద్ద వివాదానికి దారితీసేలా ఉండటాన్ని గమనించిన యాజమాన్యం చివరికి దిగిరాక తప్పలేదు. పట్టుదలను వీడి, మాల వేసుకున్న ఆరుగురు విద్యార్థులకు స్వయంగా బొట్టు పెట్టి, గౌరవంగా కాలేజీ లోపలికి ఆహ్వానించింది. దీంతో ఒక్కసారిగా అక్కడ హైడ్రామా ముగిసి వివాదం సద్దుమణిగింది. మరోసారి ఇటువంటి ఘటనలు పునరావృతమైతే కాలేజీ మూసివేయాల్సి వస్తుందని, భక్తుల విశ్వాసాలతో చెలగాటమాడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బీజేపీ నేతలు యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ హెచ్చరికలతో ఆందోళన విరమించినప్పటికీ, ఉదయం నుండి జరిగిన ఈ పరిణామాలు ఖమ్మం విద్యావర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

## వీర తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం,సెప్టెంబరు 15 :** భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం కులమతాలకు అతీతంగా కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరిస్తోందని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్ విమర్శించారు. మతాల మధ్య ఘర్షణగా చిత్రీకరించడాన్ని వారు ఖండించారు.సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా చిమ్మపూడిలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే రజబ్ అలీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కమ్యూనిస్టుల పోరాటంతోనే 10 లక్షల ఎకరాల భూములు పేదలకు దక్కాయని, 3 వేల మందికి పైగా కమ్యూనిస్టులు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. ఈ పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాత్ర ఏమీ లేదని స్పష్టం చేశారు.కమ్యూనిస్టులకు పేరు వస్తుందనే నాడు బీఆర్ఎస్, నేడు కాంగ్రెస్ ప్రభుత్వాలు పేర్లు మార్చి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా 'తెలంగాణ సాయుధ పోరాట దినోత్సవం'గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17న హైదరాబాద్ నాంపల్లి గ్రౌండ్స్‌లో జరిగే ముగింపు సభకు పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జమ్మూల జితేందర్ రెడ్డి, ఎర్ర బాబు, పగడాల మల్లేష్, చింతల రమేష్, జూల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఇళ్ల తొలగింపు నోటీసులు వెనక్కి తీసుకోవాలి




**ముద్ర ప్రతినిధి,ఖమ్మం, సెప్టెంబరు 15 :** శ్రీనివాసనగర్‌లో గత 50 ఏళ్లుగా నివాసముంటున్న పేదల ఇళ్లను తొలగించాలని మున్సిపల్ అధికారులు ఇచ్చిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బాధితులతో కలిసి సీపీఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఎస్.కే. సైదులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ... మున్సిపల్ పన్నులు, కరెంట్ బిల్లులు చెల్లిస్తూ జీవిస్తున్న పేదల ఇళ్లను రోడ్డు విస్తరణ పేరుతో తొలగించాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు.కొందరు స్వార్థపరుల కుట్రల వల్లే అధికారులతో నోటీసులు ఇప్పించారని ఆరోపించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంటనే జోక్యం చేసుకుని పేదలకు న్యాయం చేయాలని, లేకపోతే ఈ సమస్య మరొక వెలుగుమట్ల పోరాటంలా మారుతుందని స్పష్టం చేశారు. నివాస ప్రాంతాల మధ్య ఉన్న టింబర్ డిపోల వల్ల వస్తున్న చెక్క దుమ్ముతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, అయ్యప్ప స్వామి గుడి, పాఠశాలలు, పెట్రోల్ బంకులు ఉన్న ఈ ప్రాంతం నుంచి వాటిని నగర శివార్లకు తరలించాలని డిమాండ్ చేశారు. పేదలకు సీపీఎం అండగా ఉంటుందని భరోసానిస్తూ అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు వై. విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ పాల్గొన్నారు.

## గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంచిన నాయకుడు కేసీఆర్



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 15 :** గిరిజనులకు 10 శాతం ఎస్టీ రిజర్వేషన్ అమలు చేయడంతో పాటు తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి ఆత్మగౌరవాన్ని పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రావతి అన్నారు. ఖమ్మంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పలువురు బీఆర్ఎస్ గిరిజన ప్రజాప్రతినిధులతో కలిసి ఆమె మాట్లాడారు. 10 శాతం రిజర్వేషన్ కేవలం సంఖ్య కాదని, గిరిజన యువత విద్య, ఉద్యోగ భవిష్యత్తుకు ఇచ్చిన హక్కు అని పేర్కొన్నారు. పోడు భూముల సమస్యల పరిష్కారానికి, గిరిజన గురుకులాల విస్తరణకు కేసీఆర్ హయాంలోనే ప్రాధాన్యత దక్కిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే పోడు భూములు, ఉద్యోగ అవకాశాలు, సంక్షేమ పథకాలపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17న నిర్వహించే కార్యక్రమాల్లో గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వసంత, బదావత్ అనుషా, బుగ్లోత్ మాధవి, బాణోత్ దిక్షం నాయక్, అమర్ సింగ్, భుక్యా సాయి తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పి



**ముద్ర, బీబీనగర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ చెరువు వద్ద గణేశ్ నిమజ్జనం ఏర్పాట్లను ఎస్పి అక్షాన్ష్ యాదవ్ పరిశీలించి నిమజ్జనాలు సాఫీగా, శాంతియుతంగా భద్రతాపూర్వకంగా జరగాలన్నారు. ప్రజలు అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే సంబంధిత అధికారులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచనలు అందించారు.ఈ సందర్భనలో బిబీనగర్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం. ప్రభాకర్ రెడ్డి, బిబీనగర్ తహసీల్దార్ పి. శ్యామ్ సుందర్ రెడ్డి, బిబీనగర్ ఎంపీడీఓ వై. శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పి. శ్యామ్ గౌడ్ అధికారులు హాజరయ్యారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 16.09.2026
www.mudranews.in | @mudranews



**జలుబు రాకుండా**



చేతులను తరచూ శుభ్రం చేసుకోండి. బయటకు వెళ్లి వచ్చిన తర్వాత సబ్బుతో కనీసం 20 సెకన్ల పాటు చేతులు కడుక్కోవాలి. చేతుల ద్వారా వైరస్‌లు శరీరంలోకి చేరకుండా ఇది సహాయపడుతుంది.

# బడా గణేశుడు భక్తులందరినీ ఆశీర్వదించాలి

### ఖైరతాబాద్ మహాగణపతికి గవర్నర్ దంపతుల తొలి పూజ

**ముద్ర, హైదరాబాద్:** వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఖైరతాబాద్ మహా గణపతికి గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు తొలి పూజ చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దానం నాగేందర్, నగర ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గవర్నర్‌ను సత్కరించారు. అనంతరం మాట్లాడిన గవర్నర్, బడా గణేశుడిని పూజించడం ఎంతో ఆనందంగా, అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఖైరతాబాద్ వాసుల ఆరోగ్యం, సుఖసంతోషాలు, సమృద్ధిని గణేశుడు కాపాడాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రతి ప్రాంతంలో, ప్రతి కుటుంబంలో గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తి శ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారని గవర్నర్ పేర్కొన్నారు. ఖైరతాబాద్ గణేశుడు భక్తులందరినీ ఆశీర్వదించాలని ఆకాంక్షించారు. ప్రజలకు సేవ చేసే శక్తిని తనకు అందించాలని కోరుకున్నానన్నారు. గణేశ్ ఉత్సవాలు మహారాష్ట్రలో ప్రారంభమైనప్పటికీ, ఖైరతాబాద్ గణేశుడి ప్రతిమకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందన్న గవర్నర్, 72 ఏళ్లుగా ఖైరతాబాద్‌లో గణేశుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించడం విశేషమన్నారు. అంతకుముందు ఖైరతాబాద్ గణేశుడికి పూజలు చేసిన ఎమ్మెల్యే దానం నాగేందర్, 3 నెలల నుంచి



గణపతి ఉత్సవాల కోసం సిద్ధం అయినట్లు తెలిపారు. పోలీస్, ఆర్ అండ్ బీతో పాటు అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు ఎటువంటి లోటు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం ఒక్క రోజే 15 వేల మంది గణపతి దర్శనానికి వచ్చారని చెప్పారు. ఈసారి మొత్తం 30 లక్షలకు పైగానే భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు బడా గణేశుడ్ని దర్శించుకున్నట్లు వెల్లడించారు. ఈసారి వేడుకలకు 69 అడుగుల ఎత్తులో మహా గణపతిని తయారు చేశారు. పంచముఖ సంకటహర మహాగణపతిగా నామకరణం చేశారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గణనాథుడికి భారీ



కండువా జంజం సమర్పించారు. ఖైరతాబాద్ మహా గణపతి పరిసరాల్లో భారీగా పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు. భక్తుల కోసం క్యూ లైన్లు ఏర్పాటు చేశారు.

## విఘ్నేశ్వరుడికి ఎస్పీ పూజలు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడికి ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ.. వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, అభివృద్ధి నెలకొనాలని కోరుకున్నారు.

## 51 ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయం



**ముద్ర, కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయ ప్రాంగణంలో 'కూకట్‌పల్లి వినాయక భక్త బృందం' ఆధ్వర్యంలో కొలువుదీరిన బొజ్జ గణపయ్యను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు రాజేశ్వర రావును శాలువాతో సత్కరించారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ కూకట్‌పల్లి వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో 51 సంవత్సరాలుగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలు మాత్రమే కాకుండా, ఐక్యత, సేవాభావం, సంస్కృతి సంప్రదాయాలను కాపాడే గొప్ప వేదిక లన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో విఘ్నాలను తొలగించి, సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని ఆ విఘ్నేశ్వరుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

# పూర్వ ప్రాథమిక విద్య బలోపేతం కావాలి

### ఎఫ్ఎల్ఎన్ లక్ష్యసాధనలో ముందుండాలి
### కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆకస్మిక తనిఖీ

**ముద్ర ప్రతినిధి, మెదక్:** పూర్వ ప్రాథమిక విద్య బలోపేతం కావాలని, ఎఫ్ఎల్ఎన్ లక్ష్యసాధనలో ముందుండాలని, మధ్యాహ్న భోజనం నాణ్యతతో విద్యార్థులకు అందించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఉపాధ్యాయులకు సూచించారుమంగళవారం రామాయంపేట మండలం అక్కన్నపేట ప్రీ ప్రైమరీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల స్థితిగతులను, వారికి కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. విద్యా ప్రమాణాలు, మౌళిక సదుపాయాల గురించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారా లేదా అని విద్యార్థులతో పాటు క్లాస్ రూమ్ లో కూర్చుని టీచర్ బోధనను అలాగే విద్యార్థులు ఎలా అర్థం చేసుకుంటున్నారో కలెక్టర్ పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు.గర్భిణీ స్త్రీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి గర్భిణీ స్త్రీలపై డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వైద్య సిబ్బందినీ ఆదేశించారు. చేగుంటలోని పిహెచ్సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యం ఎలా అందుతుంది అని అడిగి తెలుసుకున్నారు. రూములు, మెడికల్ స్టోర్ ను, డాక్టర్ల సమయపాలన హాజరు పుస్తకాలను పరిశీలించారు. నెలలు నిండుతున్న గర్భిణీలపై వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హైరిస్కు కేసులను ఎలా పరిష్కరిస్తున్నారు, హైరిస్కు కేసుల విషయంలో జిల్లా ఆస్పత్రి నుంచి ట్యాగ్ చేయాలన్నారు.



పేదలకు మెరుగైన వైద్యం అందాలని, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, ఆసుపత్రి వాతావరణం పరిశుభ్రంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఓటర్లు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలిఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ–2026 ప్రక్రియలో మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి హియరింగ్‌కు హాజరైన ఓటర్లు సమర్పిస్తున్న ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.రామాయంపేట మండలం అక్కన్నపేట, ఝాంసింగ్ లింగాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసిలార్ రజనీతో కలిసి కలెక్టర్ ప్రతిమాసింగ్ పరిశీలించారు.నోటీసుల జారీ, ఓటర్ల హియరింగ్, ఫారాల స్వీకరణ, అప్‌లోడింగ్ ప్రక్రియలను పర్యవేక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు.





ఓటర్లు సమర్పించే ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వాటిపై తప్పనిసరిగా సంబంధిత ఓటర్ల సంతకాలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే 2002 సంవత్సరానికి చెందిన ఓటర్ల పేర్ల జాబితాను పరిశీలించి, సరిపోల్చుకోవాలని తెలిపారు.

## భూ భారతి రీ–సర్వే అభ్యంతరాలపై విచారణ



### అదనపు కలెక్టర్ నగేష్

**ముద్ర ప్రతినిధి, మెదక్:** భూ భారతి రీ–సర్వే ప్రక్రియలో భాగంగా మెదక్ మండలం పాషాపూర్ గ్రామంలో అదనపు కలెక్టర్ మెంచు నగేష్ పరిశీలించారు. గ్రామంలో రీ–సర్వేకు సంబంధించి పాషాపూర్ కు సంబంధించిన 32 అభ్యంతర పిటిషన్లను, నర్సాపూర్ కు సంబంధించి రెహమతుల్లా గ్రామానికి సంబంధించి 1 అభ్యంతరాన్ని పరిశీలించి, వాటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభ్యంతర పిటిషన్లపై రైతుల సమక్షంలో క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి, సంబంధిత రికార్డులు, భూముల వివరాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి, రైతులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించి, అభ్యంతర దరఖాస్తులను నిర్ణీత ప్రక్రియ మేరకు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.భూ భారతి రీ–సర్వే ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి అభ్యంతరాలను పారదర్శకంగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏడి ల్యాండ్ సర్వే కిషన్, తహసిల్దార్ లక్ష్మణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ పదేళ్ల పాలనలో గిరిజనులకు స్వర్ణయుగం



**ముద్ర, నిజామాబాద్, సెప్టెంబర్ 15:** బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల పాలనలో గిరిజనులకు స్వర్ణయుగం వచ్చిందని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో గత ప్రభుత్వ హయాంలో గిరిజనుల కోసం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.గిరిజనుల రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. 4,383 కొత్త గిరిజన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసి తండాలు, గూడేలకు స్వపరిపాలన అందించామని తెలిపారు.1,682 ఎస్టీ ఆవాసాల్లో రూ.1,276 కోట్లతో రోడ్లు, రూ.292 కోట్లతో 92 గురుకులాలు నిర్మించామని చెప్పారు. 2,28,089 మంది ఎస్టీ మహిళలకు రూ.151 కోట్లతో కేసీఆర్ కిట్లు, 1,36,730 మంది గిరిజన ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి ద్వారా ఆర్థిక సహాయం అందించామని వివరించారు.3,75,316 మంది గిరిజనులకు పెన్షన్లు, ఆదివాసీ–బంజారా ఆత్మగౌరవ భవనాల నిర్మాణం, గిరిజన గ్రామాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థలు, విద్యుత్ సరఫరా వంటి అనేక కార్యక్రమాలు చేపట్టామని జీవన్‌రెడ్డి తెలిపారు.237 మంది ఎస్టీ విద్యార్థులకు విదేశీ విద్య కోసం రూ.33.40 కోట్లు, 1,424 మంది గిరిజన యువతకు వాహనాల కోసం రూ.101.50 కోట్లు, మేడారం, నాగోబా, జంగుబాయి తదితర జాతర్లకు రూ.354 కోట్లు కేటాయించామని పేర్కొన్నారు. సమ్మక్క–సారలమ్మ మ్యూజియం కోసం రూ.22.53 కోట్లు ఇచ్చామని గుర్తు చేశారు.8,23,780 మంది ఎస్టీ రైతులకు రూ.7,354 కోట్ల రైతుబంధు, 4,93,720 మంది రైతులకు రూ.611 కోట్ల రైతుబీమా అందించామని తెలిపారు. గిరిజన గ్రామాల్లో రూ.1,837 కోట్లకు పైగా అభివృద్ధి పనులు, రూ.300 కోట్లతో గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం చేపట్టామని జీవన్‌రెడ్డి వివరించారు.

## గిరిజనుల అభివృద్ధికి కేసీఆర్ కృషి

### 17న అన్ని తండాల్లో కేసీఆర్‌కు పాలాభిషేకం చేయాలి



**ముద్ర, దేవరకొండ:** తెలంగాణ రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధికి అన్ని రంగాల్లో పెద్దపీట వేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు.దేవరకొండ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అధ్యక్షతన ఆయన నివాసంలో నిర్వహించిన గిరిజన ముఖ్యకార్యకర్తల సమావేశానికి జగదీశ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. గిరిజనుల రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని అన్నారు.500 జనాభా కలిగిన తండాలను గుర్తించి గ్రామపంచాయతీలుగా మార్చి, గిరిజనులు తమ తండాల్లోనే స్వయంపాలన చేసుకునే అవకాశం కల్పించారని తెలిపారు. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడం ద్వారా గిరిజనులకు రాజకీయంగా గుర్తింపు కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు.గిరిజనులు బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలవాలని జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 17వ తేదీన అన్ని తండాల్లో కేసీఆర్‌కు పాలాభిషేకం నిర్వహించాలని కోరారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బిల్యా నాయక్, కిషన్ నాయక్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజేష్ కుటుంబానికి పరామర్శ



**ముద్ర, దేవరకొండ:** దేవరకొండ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గాజుల ఆంజనేయులు తమ్ముడు గాజుల రాజేష్ కుమారుడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మంగళవారం పట్టణంలోని వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి, ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు.జగదీశ్‌రెడ్డితో పాటు స్థానిక మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, రామచంద్రనాయక్ తదితరులు రాజేష్ కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

## విద్యుత్ డీఈ కి వినతి పత్రం అందజేత



**ముద్ర, దేవరకొండ:**సీఎంఆర్ సేకరణలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైస్ మిల్లుల యాజమాన్యం మిల్లులను బంద్ చేసి సమ్మె చేస్తున్న కాలానికి గాను విద్యుత్ ఛార్జీలను పూర్తిగా మినహాయించాలని కోరుతూ మంగళవారం దేవరకొండ, కొండమల్లేపల్లి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యుత్ డీఈ బాల్య నాయక్ కు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సముద్రాల వెంకన్న మాట్లాడుతూ తప్పు చేయని మిల్లర్స్ విషయంలో కూడ కఠినంగా వ్యవహరించడం బాధాకరమన్నారు నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్న రైస్ మిల్లుల నిర్వాహకులపై విజిలెన్స్ తదితర అధికారుల వేధింపులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం సభ్యులు కేసాని లింగారెడ్డి, శీల శ్రీనివాసులు, రాఘవేంధర్, కండె రామకృష్ణ , గోవిందు జగతయ్య, శీల కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, బూరుగు శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్, కల్యాణ్ చక్రవర్తి తదితరులున్నారు.

## తెలంగాణ రక్షణ సేన నియోజకవర్గ ఇన్చార్జిగా నేనావత్ శివ నాయక్



**ముద్ర, దేవరకొండ:** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) దేవరకొండ నియోజకవర్గ ఇన్చార్జ్ గా నేనావత్ శివనాయక్ నియమితులైనారు. ఈ మేరకు మంగళవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నుంచి తనకు ఉత్తర్వులు అందినట్లు శివనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని, పేదలకు, బడుగు బలహీన వర్గాల ప్రజల ఉన్నతికై పార్టీ ఆధ్వర్యంలో ముందుకు సాగుతానని ఆయన తెలిపారు

## 27న ఎస్టీయూ 80 వసంతాల ఉత్సవాలు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) 80 వసంతాల ఉత్సవాలు విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్ కోరారు. ఈనెల 27న శుభం కన్వెన్షన్ నాగోల్ హైదరాబాద్ లో నిర్వహించే ఉత్సవాల సందర్భంగా మెదక్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పోస్టర్ విడుదల చేశారు. మండల విద్యాధికారి శంకర్, ఉపాధ్యాయ సంఘం నాయకులు నర్సింగరావు, భూపతి గౌడ్, శ్రీనివాస్, సత్యనారాయణ, బాలకృష్ణ, దిలీప్ కుమార్, రత్నాకర్, వెంకటేష్, మల్లేశం పాల్గొన్నారు.

## ఘనంగా వినాయకుడి పూజలు



**ముద్ర, చేవెళ్ళ:** చేవెళ్ళ నియోజకవర్గం లోని అన్ని మండల కేంద్రాలలో, గ్రామాలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు నిర్వాహకులు ఘనంగా పూజలు నిర్వహించారు. శంకర్ పల్లి లో సామాజిక సమరసత ఆధ్వర్యంలో మట్టి వినాయకులను వినాయక చవితి సందర్భంగా సోమవారం అందచేశారు. మంగళ వారం మండపల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. అన్నప్రాసదా వితరణ కార్యక్రమం నిర్వాణించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య చేవెళ్ళ పురపాలిక లోని పలు వినాయక మండపల్లో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555